# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 41 | ఎడిటర్: మేనం శ్యామ్ | శుక్రవారం 28-08-2026 | పేజీలు: 10



దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర

తులం బంగారం
(10 గ్రాములు)

1,50,100/-
(22 క్యారెట్స్)

1,63,750/-
(24 క్యారెట్స్)


## సిరా చుక్క

రాఖీ పండగ రోజు చూపించే ప్రేమలు
ఒక్కరోజుకే పరిమితం కాకూడదు..
చేతికి కట్టే ఆ చిన్న దారం
జీవితాంతం బంధాన్ని గుర్తు చేయాలి..
ఆస్తుల కోసం అనుబంధాలు తెంచుకుని,
అన్నదమ్ముల మధ్య గోడలు కట్టుకుని,
అక్కాచెల్లెళ్ల ఆత్మీయతను దూరం చేసుకుని
సంబంధాలకు విలువ లేకుండా చేయొద్దు..
ఆస్తులు ఈరోజు ఉంటాయి..
రేపు ఉండకపోవచ్చు..కావున
ఆస్తుల కోసం బంధాలను కోల్పోకండి..
బంధాలను కాపాడుకుంటే
అదే నిజమైన సంపద..
రాఖీ రోజు మాత్రమే కాదు..
ప్రతి రోజూ అన్నాచెల్లెళ్ల ప్రేమ
ఇలాగే కలకాలం నిలిచి ఉండాలి!...

– అరుణ్ రెడ్డి పన్నాల. ..,
వికారాబాద్ జిల్లా బ్యూరో చీఫ్



# మీర్‌ఆలంపై సీఎం రేవంత్ మెగా విజన్

- ఐకానిక్ బ్రిడ్జి నుంచి అంతర్జాతీయ టూరిజం హబ్ వరకు.. పాతబస్తీ ముఖచిత్రం మార్చే భారీ ప్రణాళిక
- క్రేన్‌పైకి ఎక్కి మరీ పనుల పరిశీలన
- అధికారులకు సీఎం కీలక ఆదేశాలు
- రూ.430 కోట్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జితో ట్రాఫిక్‌కు చెక్
- కనెక్టివిటీకి కొత్త ఊపు
- మూడు ద్వీపాలకు 'గార్డెన్స్ బై ది బే' తరహా రూపం
- వాటర్ స్పోర్ట్స్, గ్లాంపింగ్, ఫుడ్ కోర్టులకు గ్రీన్ సిగ్నల్
- నెహ్రూ జూ పార్కుతో అనుసంధానం
- చింతల్‌మెట్–కిషన్‌బాగ్ రోడ్డు విస్తరణకు ఆదేశం





**రూ.430 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జి.. ట్రాఫిక్‌కు ఉపశమనం**

**రాజేంద్రనగర్/హైదరాబాద్ (ప్రజా వాయిస్):** చారిత్రక మీర్‌ఆలం చెరువు రూపురేఖలను పూర్తిగా మార్చి, హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ స్థాయి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మెగా విజన్‌కు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మీర్‌ఆలం చెరువు వద్దకు చేరుకున్న సీఎం, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భారీ క్రేన్‌పైకి ఎక్కి మరీ చెరువు, పరిసర ప్రాంతాలు, నిర్మాణ పనులను పరిశీలించడం ఈ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధికారులతో కలిసి ఓపెన్‌టాప్ జీప్‌లో చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించిన సీఎం, సుమారు గంటకు పైగా అక్కడే ఉండి ప్రాజెక్టు డిజైన్లు, ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా పనుల పురోగతిని సమీక్షించారు. కేవలం ఒక బ్రిడ్జి నిర్మాణంతో సరిపెట్టకుండా, మీర్‌ఆలం చెరువు మొత్తం పరిసరాలను రవాణా, పర్యాటకం, వినోదం, పర్యావరణం సమ్మిళితమైన సమగ్ర అభివృద్ధి కేంద్రంగా మార్చాలన్న దిశగా అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు రూ.430 కోట్ల అంచనా వ్యయంతో 2.65 కిలోమీటర్ల పొడవు, 22.2 మీటర్ల వెడల్పుతో ఐకానిక్ కేబుల్ స్టేడ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఈ బ్రిడ్జి పూర్తయితే బెంగళూరు జాతీయ రహదారి నుంచి చింతల్‌మెట్, శాస్త్రిపురం వైపు ప్రయాణించే వాహనదారులకు మెరుగైన కనెక్టివిటీ లభించడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం ఉంది. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. చెరువు మధ్యలో నిర్మిస్తున్న పియర్ల పనుల పురోగతిపై

మిగతా 2లో

## తెలంగాణ గవర్నర్‌కు అస్వస్థత

- యశోదలో చికిత్స అనంతరం డిశ్చార్జ్
- అనారోగ్యంతో ఆగస్టు 26న ఆస్పత్రిలో చేరిన శివ్ ప్రతాప్ శుక్లా.
- గవర్నర్‌ను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి.
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న సీఎం.
- చికిత్స అనంతరం లోక్‌భవన్‌కు గవర్నర్

2 లో













# తెలంగాణలో బీసీ నేతలే టార్గెట్

- ఎదిగిన కొద్దీ ఒక్కొక్కరిపై ఒక్కో అస్త్రం
- కుటుంబం, భూములు, వ్యాపారం, వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయ దాడులు
- బండి సంజయ్.. కుటుంబ వ్యవహారాలపై విమర్శలు
- ఈటల రాజేందర్.. భూ వివాదాలతో రాజకీయ రచ్చ
- తీన్మార్ మల్లన్న.. 'బ్లాక్‌మెయిల్' ఆరోపణలతో దుమారం
- వడ్డే జానయ్య యాదవ్.. మిల్లుల వ్యవహారాలపై వివాదం
- శ్రీనివాస్‌గౌడ్.. వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయ వేడి
- 'బీసీలు ఎదిగితేనే కుట్రలు' అంటూ ఆ వర్గాల్లో ఆందోళన

**ప్రజా వాయిస్ డెస్క్,హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో బీసీ నేతలపై జరుగుతున్న రాజకీయ దాడులు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. వివిధ పార్టీల్లో రాజకీయంగా ఎదిగిన బీసీ నాయకులపై ఒక్కొక్కరిపై ఒక్కో అంశాన్ని అస్త్రంగా చేసుకుని విమర్శలు, ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబం నుంచి భూముల వరకు.. వ్యాపారం నుంచి వ్యక్తిగత ఆరోపణల వరకు రకరకాల అంశాలు రాజకీయ రచ్చకు కారణమవుతున్నాయి.

**బండి సంజయ్.. కుటుంబమే అస్త్రంగా**


బీజేపీలో కీలక నేతగా ఎదిగిన బండి సంజయ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే క్రమంలో ప్రత్యర్థులు కుటుంబ అంశాలను ప్రస్తావిస్తూ విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థిపై వ్యక్తిగత అంశాలను తీసుకురావడంపై

మిగతా 2లో

## మైన్స్ ఏడీ జయరాజ్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ప్రాంతాల్లో ఏకకాల తనిఖీలు
- ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై విస్తృత దాడులు
- భూపాలపల్లి, హైదరాబాద్, తాండూరు, సూర్యాపేటల్లో ఏసీబీ బృందాల తనిఖీలు
- స్థిర, చరాస్తులు.. నగదు, బంగారం, కీలక పత్రాలపై ఆరా

2 లో



## తమిళనాడు గవర్నర్‌గా కిరణ్‌కుమార్‌రెడ్డి?

- విజయ్–కిరణ్ బంధంపై ఆసక్తికర చర్చ
- టీవీకే రాజకీయ పరిణామాల వేళ కేంద్రం వ్యూహమేనా?
- గవర్నర్ పదవికి మాజీ సీఎం పేరు తెరపైకి
- అధికారిక ప్రకటనపై ఉత్కంఠ



**ప్రజా వాయిస్,చెన్నై.** తమిళనాడు రాజకీయాల్లో మరో ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని తమిళనాడు గవర్నర్‌గా నియమించే అవకాశాలున్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నర్ల నియామకాలపై కసరత్తు చేస్తున్న నేపథ్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉందంటూ తాజాగా కథనాలు వెలువడ్డాయి. అయితే దీనిపై కేంద్రం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.ప్రస్తుతం కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు ఉన్నాయి. తమిళనాడు రాజ్‌భవన్ అధికారిక సమాచారం ప్రకారం అర్లేకర్ 2026 మార్చి 12న తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

**విజయ్‌తో సంబంధాలపైనే ఆసక్తి**

కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు తమిళనాడు గవర్నర్ పదవికి వినిపించడానికి మరో రాజకీయ కోణం కూడా ఉందనే చర్చ సాగుతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత సి.జోసెఫ్ విజయ్‌కు కిరణ్‌కుమార్‌రెడ్డి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కిరణ్‌కుమార్‌రెడ్డికి సమీప బంధువైన విష్ణువర్ధన్‌రెడ్డి విజయ్‌కు సన్నిహితుడిగా ఉండటమే కాకుండా తమిళనాడు ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు.ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డిని తమిళనాడు గవర్నర్‌గా

మిగతా 2లో

## హరీష్ రావు 'గ్రేట్ ఎస్కేప్'

- హౌస్ అరెస్టును దాటుకుని హనుమకొండకు హరీష్ రావు
- టీఎన్జీవోల ధర్నాలో పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం
- మెరుగైన పీఆర్సీ.. పెండింగ్ బకాయిల విడుదలకు డిమాండ్
- విద్యార్థుల ఆందోళనకు వెళ్లే క్రమంలో పోలీసుల అదుపులోకి
- అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు
- మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం

2 లో



## డీలిమిటేషన్‌పై అఖిలపక్షం పెట్టండి

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి ముందే అన్ని పార్టీలతో చర్చించాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు తగిన సమయం ఇవ్వాలి
- 543 లోక్‌సభ స్థానాలను మరో 25 ఏళ్లు కొనసాగించాలి
- 2029 నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి
- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ



**ప్రజా వాయిస్,న్యూఢిల్లీ.** దేశ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే డీలిమిటేషన్ అంశంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేసే ముందు ఈ అంశంపై విస్తృతంగా చర్చించాలని సూచించారు. కేంద్రం ప్రతిపాదనలను ముందుగానే అన్ని పార్టీలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించి వాటిని పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని తన లేఖలో ఖర్గే స్పష్టం చేశారు.

**దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలే కీలకం**

జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన ఇప్పటికే వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాజకీయ ప్రాతినిధ్య సమతుల్యతను కాపాడాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ వాదిస్తోంది. కేవలం జనాభా సంఖ్య ఆధారంగా స్థానాల పునర్విభజన చేయడం వల్ల రాష్ట్రాల మధ్య రాజకీయ బలం మారిపోవచ్చని ఆ పార్టీ అభిప్రాయపడుతోంది.

మిగతా 2లో

# కట్టేది దారమే.. కలిపేది గుండెలనే

- రాఖీ బంధం.. జీవితాంతం తోడు
- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్
- కాలం మారినా.. మారని ఆత్మీయత
- రాఖీ కడుతున్న చేతుల్లో ప్రేమ.. అన్నను కాపాడాలనే నమ్మకం
- కుటుంబ బంధాలను గుర్తుచేసే ప్రత్యేక పర్వదినం
- రాజకీయాలు, ఆస్తులు, అంతరాలు వేరు
- రక్తసంబంధం మాత్రం ఎప్పటికీ ఒక్కటే



**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం.**రాఖీ.. కేవలం ఓ దారం కాదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధానికి కనిపించే రూపం. చేతికి కట్టే ఆ చిన్న దారంలో ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యత, రక్షణ వంటి ఎన్నో భావాలు దాగి ఉంటాయి. అందుకే రక్షాబంధన్ పండుగకు భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉంది. కాలం మారుతోంది.. జీవన విధానాలు మారుతున్నాయి.. కుటుంబాలు చిన్నవవుతున్నాయి.. కానీ అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ఆత్మీయత మాత్రం ఇప్పటికీ చెక్కుచెదరలేదు.

### చిన్ననాటి అల్లరి నుంచి జీవితాంతం అనుబంధం

చిన్నతనంలో ఒకరితో ఒకరు గొడవపడే అన్నాచెల్లెళ్లు.. పెద్దయ్యాక ఒకరికొకరు అండగా నిలుస్తారు. బాల్యంలో బొమ్మ కోసం, చాక్లెట్ కోసం, టీవీ రిమోట్ కోసం జరిగే చిన్నపాటి గొడవలు కాలంతో పాటు తీపి జ్ఞాపకాలుగా మారిపోతాయి. తల్లిదండ్రుల తర్వాత తమ కష్టసుఖాలను అర్థం చేసుకునే వ్యక్తుల్లో అన్నాచెల్లెళ్లు ముందుంటారు.రాఖీ పండుగ అలాంటి అనుబంధాన్ని మరోసారి గుర్తుచేస్తుంది. చెల్లెలు లేదా అక్క అన్నకు రాఖీ కడుతూ తన ప్రేమను వ్యక్తం చేస్తే.. అన్న తన సోదరికి అండగా ఉంటాననే భరోసా ఇస్తాడు. ఇదే రాఖీ పండుగ అసలు స్ఫూర్తి.

### దూరాలు పెరిగినా.. బంధం తగ్గదు

ఉద్యోగాలు, చదువులు, వివాహాలు, విదేశీ ప్రయాణాలు.. ఇలా కారణాలు ఏవైనా అన్నాచెల్లెళ్లు వేర్వేరు ప్రాంతాల్లో నివసించడం సాధారణమైంది. ఒకప్పుడు ఒకే ఇంట్లో కలిసి పండుగ చేసుకున్న వారు.. ఇప్పుడు వీడియో కాల్స్, ఆన్‌లైన్ గిఫ్టులు, కొరియర్ ద్వారా రాఖీలు పంపించుకునే పరిస్థితి వచ్చింది.అయినా పండుగ రోజు వచ్చే ఒక్క ఫోన్‌కాల్.. 'రాఖీ కట్టించుకున్నావా?' అనే ఒక్క మాట.. చిన్ననాటి జ్ఞాపకాలను కళ్లముందుకు తెస్తుంది. దూరం శరీరాల మధ్య మాత్రమే.. మనసుల మధ్య కాదని రాఖీ మరోసారి గుర్తుచేస్తుంది.

### రాజకీయాలు వేరు.. కుటుంబ బంధం వేరు

ప్రజా జీవితంలో ఉన్న అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయ విభేదాలు ఉండొచ్చు. పార్టీల పరంగా భిన్న అభిప్రాయాలు ఉండొచ్చు. రాజకీయంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవచ్చు. కానీ అవన్నీ ప్రజా జీవితానికి సంబంధించిన విషయాలే. కుటుంబ బంధం మాత్రం వాటికి అతీతం.రాజకీయాలు, ఆస్తులు, అభిప్రాయ భేదాలు, మనస్పర్థలు ఎన్ని ఉన్నా.. అన్నాచెల్లెళ్ల రక్తసంబంధాన్ని అవి చెరపలేవు. అందుకే రాఖీ రోజు కుటుంబ బంధాలకు మరోసారి ప్రాధాన్యం లభిస్తుంది. 'ప్రజా జీవితం వేరు.. వ్యక్తిగత బంధాలు వేరు' అనే సందేశాన్ని ఈ పండుగ సమాజానికి అందిస్తుంది.

### రాఖీ అంటే రక్షణ మాత్రమే కాదు

సంప్రదాయంగా రాఖీని అన్నాచెల్లెళ్ల మధ్య రక్షణకు ప్రతీకగా భావించినా.. నేటి కాలంలో దాని అర్థం మరింత విస్తరించింది. ఒకరికి ఒకరు అండగా నిలవడం, కష్టాల్లో తోడుండటం, జీవితంలో ముందుకు వెళ్లేందుకు ప్రోత్సహించడం కూడా రక్షణలో భాగమే.అన్న చెల్లెల్ని కాపాడటం మాత్రమే కాదు.. అవసరమైనప్పుడు చెల్లెలు కూడా అన్నకు అండగా నిలుస్తుంది. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, జీవితంలోని ఒడిదుడుకుల్లో పరస్పరం తోడుగా ఉండటమే నిజమైన రక్షాబంధన్.

### సోషల్ మీడియా కాలంలోనూ అదే మమకారం

సెల్ఫీలు, వీడియో కాల్స్, సోషల్ మీడియా పోస్టులతో రాఖీ వేడుకలు కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. రాఖీ కట్టిన ఫొటోలను షేర్ చేసుకోవడం.. చిన్ననాటి ఫొటోలను గుర్తుచేసుకోవడం.. ఒకరిపై ఒకరు ప్రేమను వ్యక్తం చేస్తూ సందేశాలు పెట్టడం ఇప్పుడు సాధారణమైంది.సాంకేతికత పండుగను మార్చింది కానీ.. పండుగలోని భావాన్ని మాత్రం మార్చలేకపోయింది. రాఖీ కట్టే సమయంలో అన్నాచెల్లెళ్ల కళ్లలో కనిపించే ఆనందం, ఆప్యాయత ఇప్పటికీ అదే.

### ఒక్క రాఖీ.. ఎన్నో జ్ఞాపకాలు

ప్రతి రాఖీకి ఓ జ్ఞాపకం ఉంటుంది. చిన్నప్పుడు అన్న కొనిచ్చిన బొమ్మ.. చెల్లెలు దాచుకున్న చాక్లెట్.. రాఖీ కట్టినందుకు ఇచ్చిన చిన్న గిఫ్ట్.. పండుగ సందర్భంగా కుటుంబమంతా కలిసి చేసిన సందడి.. ఇవన్నీ కాలం గడిచేకొద్దీ విలువైన జ్ఞాపకాలుగా మారతాయి.జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా.. బాల్యంలోకి తీసుకెళ్లే బంధాల్లో అన్నాచెల్లెళ్ల అనుబంధం ప్రత్యేకమైనది. అందుకే రాఖీ పండుగ కేవలం ఒక రోజు వేడుక కాదు.. జీవితాంతం కొనసాగే అనుబంధాన్ని గుర్తుచేసే రోజు.

### బంధాలను కాపాడుకుందాం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనుషులు దగ్గరగా ఉన్నా.. మనసులు దూరమవుతున్నాయి. అలాంటి సమయంలో రాఖీ పండుగ కుటుంబ బంధాల విలువను గుర్తుచేస్తుంది. ఒకరిని ఒకరు గౌరవించుకోవడం.. కష్టాల్లో తోడుగా నిలవడం.. మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో అండగా ఉండటం.. ఇదే రాఖీ పండుగ ఇచ్చే అసలైన సందేశం.

# మీర్‌ఆలంపై సీఎం రేవంత్ మెగా విజన్



అధికారులను సీఎం ఆరా తీశారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ వంతెన కేవలం రవాణా సౌకర్యానికే పరిమితం కాకుండా హైదరాబాద్‌కు మరో ఐకానిక్ గుర్తింపుగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది

### మూడు ద్వీపాలకు అంతర్జాతీయ హంగులు

మీర్‌ఆలం చెరువులోని ద్వీపాలను సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే' తరహాలో అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి అందాలను కాపాడుతూ రిలాక్సేషన్ జోన్లు, థీమ్ ఆధారిత ఆకర్షణలు, ప్రత్యేక లైటింగ్, ఈవెంట్ స్పేస్‌లు, వెడ్డింగ్ డెస్టినేషన్లకు అనువుగా వాటిని తీర్చిదిద్దాలని ఆదేశించారు.దేశ, విదేశీ పర్యాటకులు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు మీర్‌ఆలం చెరువు ఒక తప్పనిసరి సందర్శనీయ ప్రాంతంగా మారేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటం ఈ ప్రాంతానికి అదనపు ప్రయోజనంగా ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### వాటర్ స్పోర్ట్స్ నుంచి గ్లాంపింగ్ వరకు..

మీర్‌ఆలం చెరువులో ఆధునిక బోటింగ్ సదుపాయాలతో పాటు వాటర్ స్పోర్ట్స్‌కు రూపకల్పన చేయాలని సీఎం సూచించారు. పర్యాటకులు కుటుంబ సమేతంగా ఎక్కువ సమయం గడిపేలా లగ్జరీ క్యాంపింగ్, గ్లాంపింగ్, ఫుడ్ కోర్టులు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పక్కనే ఉన్న నెహ్రూ జూ పార్క్‌తో మీర్‌ఆలం చెరువును అనుసంధానించి ఒక సమగ్ర పర్యాటక కారిడార్‌గా అభివృద్ధి చేయాలన్నది సీఎం విజన్‌లో కీలక అంశంగా నిలిచింది. దీంతో జూ సందర్శనకు వచ్చే పర్యాటకులు చెరువు అభివృద్ధి ప్రాంతాన్నీ సందర్శించేలా, ఒకే ప్రాంతంలో పలు పర్యాటక అనుభవాలు పొందేలా ప్రణాళికలు రూపొందించనున్నారు.

### చెరువు పరిరక్షణకూ ప్రాధాన్యం

అభివృద్ధి పనులతో పాటు మీర్‌ఆలం చెరువు పరిరక్షణకు కూడా సీఎం సమాన ప్రాధాన్యం ఇచ్చారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, గుర్రపు డెక్కను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చెరువు నుంచి మూసీ నదిలోకి వెళ్లే నాలాను విస్తరించాలని అధికారులను ఆదేశించారు.

### చింతల్‌మెట్–కిషన్‌బాగ్ రోడ్డుకు కొత్త ఊపు

భారీ పర్యాటక అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని సీఎం నిర్ణయించారు. ఇందులో భాగంగా చింతల్‌మెట్ నుంచి కిషన్‌బాగ్ వరకు ఉన్న రహదారిని విస్తరించి, ఈ ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు.ఐకానిక్ బ్రిడ్జి, చెరువు సుందరీకరణ, పర్యాటక కేంద్రాలు, జూ పార్క్ అనుసంధానం, రోడ్డు విస్తరణ.. ఇలా అన్ని రంగాలను కలుపుతూ మీర్‌ఆలం ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి మెగా విజన్‌గా కనిపిస్తోంది.

### పాతబస్తీ అభివృద్ధికి కొత్త దిశ

ఒకప్పుడు ప్రధానంగా నీటి వనరుగా, చారిత్రక గుర్తుగా మాత్రమే ఉన్న మీర్‌ఆలం చెరువును ఇప్పుడు హైదరాబాద్ భవిష్యత్ పర్యాటక ముఖచిత్రంలో కీలక కేంద్రంగా నిలపాలన్న ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం, పర్యాటక సదుపాయాలు, ద్వీపాల అభివృద్ధి, వాటర్ స్పోర్ట్స్, జూ పార్క్ అనుసంధానం, మెరుగైన రోడ్డు కనెక్టివిటీ వంటి అంశాలు కార్యరూపం దాల్చితే మీర్‌ఆలం ప్రాంతం హైదరాబాద్‌లో మరో ప్రధాన ఆకర్షణగా మారే అవకాశముంది. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఎంఆర్‌ఎఫ్‌డీసీఎల్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఎంఆర్‌ఎఫ్‌డీసీఎల్ ఈడీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, జేఎండీ గౌతమి, సీఎం కార్యాలయ కార్యదర్శి మాణిక్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మైన్స్ ఏడీ జయరాజ్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**జయశంకర్ భూపాలపల్లి**, ఆగస్టు 27 (ప్రజా వాయిస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ (మైన్స్) అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్ నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, అందిన సమాచారంతో ఏసీబీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. భూపాలపల్లిలోని జయరాజ్ నివాసంతో పాటు హైదరాబాద్‌లోని ఆయనకు సంబంధించిన నివాసాల్లోనూ అధికారులు ఏకకాలంలో తనిఖీలు కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా తాండూరు, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో మొత్తం 12 చోట్ల ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.సోదాల్లో భాగంగా జయరాజ్‌కు సంబంధించిన స్థిర, చరాస్తుల వివరాలు, భూములు, ఇళ్లు, బ్యాంకు ఖాతాలు, నగదు, బంగారం, కీలక పత్రాలు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆయన ప్రకటించిన ఆదాయానికి, వాస్తవంగా సమకూర్చుకున్న ఆస్తులకు మధ్య ఉన్న వ్యత్యాసంపై ఏసీబీ అధికారులు సమగ్రంగా ఆరా తీస్తున్నారు.వివిధ ప్రాంతాల్లో ఒకేసారి జరుగుతున్న ఈ సోదాలు భూపాలపల్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం తనిఖీలు కొనసాగుతున్నందున స్వాధీనం చేసుకున్న నగదు, ఆస్తి పత్రాలు, ఇతర విలువైన వస్తువులు, మొత్తం ఆస్తుల విలువకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.సోదాలు ముగిసిన అనంతరం ఏసీబీ అధికారులు పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. తనిఖీల్లో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి న్యాయపరమైన చర్యలపై స్పష్టత వచ్చే అవకాశముందని సమాచారం.

# హరీష్ రావు 'గ్రేట్ ఎస్కేప్'

**ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్**. పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వరంగల్ వెళ్లాలని నిర్ణయించుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావును పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా.. ఆయన హనుమకొండకు చేరుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఉదయం కోకాపేటలోని నివాసం వద్ద హౌస్ అరెస్ట్ చేసినట్లు సమాచారం. పోలీసుల ఆంక్షలను దాటుకుని హనుమకొండ చేరుకున్న హరీష్ రావు తొలుత ప్రభుత్వ ఉద్యోగుల ధర్నాలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అనంతరం విద్యార్థుల ఆందోళన వద్దకు వెళ్లే ప్రయత్నంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

### హౌస్ అరెస్ట్ దాటుకుని హనుమకొండకు

పాలిటెక్నిక్ విద్యార్థులు జీవో–97కు వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనకు హరీష్ రావు సంఘీభావం ప్రకటించారు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వరంగల్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆయన పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు కోకాపేటలోని నివాసం వద్ద భారీగా మోహరించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేసినట్లు సమాచారం. పోలీసుల చర్యలపై హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై స్పందించేందుకు వెళ్తున్న తనను అడ్డుకోవడం సరికాదని అన్నారు.

### ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం

పోలీసుల ఆంక్షల మధ్య హరీష్ రావు హనుమకొండకు చేరుకోవడం ఆసక్తికరంగా మారింది. జిల్లా కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవోలు నిర్వహిస్తున్న ఉద్యోగుల ధర్నాలో పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ఉద్యోగులను బెదిరించడం తగదు

ఉద్యోగ సంఘాల నాయకులను బెదిరించడం, విజిలెన్స్, ఏసీబీ కేసుల పేరుతో ఒత్తిళ్లు తీసుకురావడం సరికాదని హరీష్ రావు మండిపడ్డారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై ఒత్తిడి పెంచడం సమంజసం కాదన్నారు. ఉద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ఎప్పుడూ సాఫీగా సాగలేదని హెచ్చరించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

### విద్యార్థుల వద్దకు వెళ్లే క్రమంలో అరెస్ట్

ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలిపిన అనంతరం హరీష్ రావు పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీసులను ప్రతిఘటించేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు హరీష్ రావును అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ వాహనంలో వెళ్లేందుకు ఆయన నిరాకరించి కాలినడకన పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం అక్కడ ప్రత్యేకంగా కనిపించింది.

### అరెస్టులతో ఉద్యమాలు ఆగవు

హరీష్ రావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టి మాజీ మంత్రిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం, హౌస్ అరెస్టులు చేయడం, నిర్బంధించడం ద్వారా ప్రజా సమస్యలపై పోరాటాలను ఆపలేరని బీఆర్ఎస్ వర్గాలు విమర్శించాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగుల సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశాయి.ఉదయం కోకాపేటలో హౌస్ అరెస్ట్‌తో మొదలైన హరీష్ రావు రోజు.. పోలీసుల ఆంక్షలను దాటుకుని హనుమకొండ చేరుకోవడం, ఉద్యోగుల ధర్నాలో పాల్గొనడం, అనంతరం విద్యార్థుల ఆందోళనకు వెళ్లే ప్రయత్నంలో అదుపులోకి రావడంతో ఉత్కంఠగా సాగింది. ఈ మొత్తం పరిణామాన్ని బీఆర్ఎస్ శ్రేణులు హరీష్ రావు గ్రేట్ ఎస్కేప్ గా అభివర్ణిస్తుండగా.. తెలంగాణ రాజకీయాల్లో ఈ ఘటన హాట్ టాపిక్‌గా మారింది.

# తెలంగాణలో బీసీ నేతలే టార్గెట్

మొదటి పేజీ తరువాయి

ఆయన వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

### ఈటల.. భూముల వివాదం

త్రి పదవి నుంచి తొలగింపు, అనంతరం రాజకీయంగా సొంత బలం పెంచుకున్న ఈటల రాజేందర్ చుట్టూ భూ వ్యవహారాలు పెద్ద వివాదంగా మారాయి. భూ ఆరోపణలను రాజకీయ అస్త్రంగా ఉపయోగించారనే విమర్శలు అప్పట్లో తీవ్రంగా వినిపించాయి.

### మల్లన్న.. 'బ్లాక్‌మెయిల్' ఆరోపణలు

తీన్మార్ మల్లన్న రాజకీయ ప్రస్థానంలో ఆయనపై 'బ్లాక్‌మెయిల్' ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే ఈ ఆరోపణలను మల్లన్న వర్గం ఖండించింది. రాజకీయంగా ఎదిగిన నేతపై వ్యక్తిగత ముద్ర వేసే ప్రయత్నమని ఆరోపించింది.

### జానయ్య యాదవ్.. మిల్లుల చుట్టూ వివాదం

వడ్డే జానయ్య యాదవ్‌కు సంబంధించిన వ్యాపార, మిల్లుల వ్యవహారాలు కూడా రాజకీయ వివాదాలకు కారణమయ్యాయి. రాజకీయంగా ఎదుగుతున్న బీసీ నేతను వివిధ అంశాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఆయన అనుచరుల నుంచి వచ్చాయి.

### శ్రీనివాస్‌గౌడ్.. వ్యక్తిగత ఆరోపణలతో రచ్చ

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై రాజకీయ విమర్శలు వ్యక్తిగత ఆరోపణల వరకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. మహిళలు, వ్యక్తిగత వ్యవహారాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులు చేసిన ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపాయి. వాటిని ఆయన వర్గం ఖండించింది.

### ఒక్కొక్కరిపై ఒక్కో అస్త్రం

కుటుంబం.. భూములు.. బ్లాక్‌మెయిల్.. వ్యాపారం.. వ్యక్తిగత ఆరోపణలు.. ఇలా బీసీ నేతలపై ఒక్కొక్కరిపై ఒక్కో అంశం రాజకీయ అస్త్రంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు రాజకీయంగా ఎదిగినప్పుడు వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారనే వాదన తెరపైకి వస్తోంది.

### బీసీ రిజర్వేషన్ల మాటేంటి.?

రాజకీయంగా ఎదిగిన బీసీ నేతలపై వ్యక్తిగత దాడులు కాకుండా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లపై పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

# తమిళనాడు గవర్నర్‌గా కిరణ్‌కుమార్‌రెడ్డి?

మొదటి పేజీ తరువాయి



పంపితే అది కేవలం పరిపాలనా నియామకమేనా? లేక విజయ్ నేతృత్వంలోని టీవీకే రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్న కేంద్ర వ్యూహమా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

### ఎన్డీఏ వైపు విజయ్‌ను తీసుకురావడమేనా?

తమిళనాడులో టీవీకే బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతున్న సమయంలో విజయ్ రాజకీయంగా ఏ కూటమి వైపు అడుగులు వేస్తారన్నది జాతీయ రాజకీయాల్లోనూ ఆసక్తికర అంశంగా మారింది. ఈ క్రమంలో విజయ్‌తో సత్సంబంధాలున్న వ్యక్తుల ద్వారా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.అయితే కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకాన్ని విజయ్‌ను ఎన్డీఏ వైపు తీసుకెళ్లే వ్యూహంతో నేరుగా ముడిపెట్టడానికి ప్రస్తుతానికి అధికారిక ఆధారాలు లేవు. ఇది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ మాత్రమేనని స్పష్టత అవసరం.

### కాంగ్రెస్ నుంచి బీజేపీకి.. ఇప్పుడు రాజ్‌భవన్‌కు?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి అనంతరం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాజంపేట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు ఆయనకు రాజ్యాంగ పదవి దక్కే అవకాశాలపై చర్చ మొదలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### అధికారిక ప్రకటన ఎప్పుడో?

తమిళనాడు గవర్నర్‌గా కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకం ఖరారైందని కొన్ని మీడియా కథనాలు పేర్కొంటున్నప్పటికీ, రాష్ట్రపతి భవన్ లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అప్పటివరకు ఇది నియామకంపై జరుగుతున్న ప్రచారం, రాజకీయ చర్చగానే చూడాల్సి ఉంటుంది.కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు నిజంగానే ఖరారైందా? లేక చివరి నిమిషంలో మరో పేరును కేంద్రం ఎంపిక చేస్తుందా? అన్నది త్వరలోనే తేలనుంది.

# తెలంగాణ గవర్నర్‌కు అస్వస్థత

**హైదరాబాద్,ప్రజా వాయిస్**. తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో ఆయనను ఆగస్టు 26న హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ యశోద ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించిన అనంతరం గురువారం మధ్యాహ్నం ఆయనను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అనంతరం గవర్నర్ తిరిగి లోక్‌భవన్‌కు చేరుకున్నారు. అయితే ఆయనకు వచ్చిన ఆరోగ్య సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను అధికార వర్గాలు వెల్లడించలేదు. గవర్నర్ అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యశోద ఆస్పత్రికి వెళ్లి శివ్ ప్రతాప్ శుక్లాను పరామర్శించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. సీఎం వెంట ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన గవర్నర్‌కు వైద్యులు అవసరమైన చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం గవర్నర్ ఆరోగ్య పరిస్థితి కుదుటగా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# డీలిమిటేషన్‌పై అఖిలపక్షం పెట్టండి

మొదటి పేజీ తరువాయి

### 543 స్థానాలు మరో 25 ఏళ్లు కొనసాగాలి

ప్రస్తుత లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలని ఖర్గే ప్రతిపాదించారు. అంతేకాకుండా రాష్ట్రాల వారీగా ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల కేటాయింపును కూడా 25 ఏళ్ల పాటు కొనసాగించాలని కోరారు. ఈ ప్రతిపాదన ద్వారా జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం జరగకుండా చూడాలని కాంగ్రెస్ భావిస్తోంది.

### మహిళా రిజర్వేషన్లపై స్పష్టమైన డిమాండ్

డీలిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ల అంశాన్ని కూడా ఖర్గే లేఖలో ప్రస్తావించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టి ఆలస్యం చేయకుండా ముందుగానే అమలు చేయాలని కాంగ్రెస్ కోరుతోంది.

### రాష్ట్రాలను సంప్రదించాల్సిందే

డీలిమిటేషన్ కేవలం పార్లమెంట్ స్థానాల పునర్విభజనకు సంబంధించిన అంశం కాదని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. దీని ప్రభావం రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం, సమాఖ్య వ్యవస్థపై పడే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గే కోరారు. కేంద్రం తన ప్రతిపాదనలను ముందుగా రాష్ట్రాలకు పంపించి, వాటిపై అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని పేర్కొన్నారు.

### ఏకపక్షంగా ముందుకు వద్దు

డీలిమిటేషన్ వంటి కీలకమైన అంశంపై ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఖర్గే సూచించారు. పార్లమెంట్‌లో బిల్లులను ప్రవేశపెట్టే ముందు రాజకీయ పార్టీలతో చర్చించి ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నం చేయాలని కోరారు. గతంలో జరిగిన చర్చలను ప్రస్తావిస్తూ.. ఈసారి అన్ని వర్గాలను భాగస్వాములను చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

### కేంద్రంపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి

డీలిమిటేషన్‌పై కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉందన్న చర్చల నేపథ్యంలో ఖర్గే లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై తమ ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక సమావేశానికి ముందే అఖిలపక్ష భేటీ నిర్వహించాలన్న డిమాండ్ కేంద్రానికి రాజకీయంగా కీలక సవాల్‌గా మారనుంది.

### సమాఖ్య వ్యవస్థపై ప్రభావం

డీలిమిటేషన్ అమలు విధానం దేశ రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. ఏ రాష్ట్రానికి ఎన్ని లోక్‌సభ స్థానాలు దక్కుతాయి? ప్రస్తుత రాజకీయ ప్రాతినిధ్యం ఎలా మారుతుంది? జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు ఎలాంటి రక్షణ ఉంటుంది? వంటి అంశాలపై తీవ్ర చర్చ జరిగే అవకాశం ఉంది. అందుకే అన్ని రాష్ట్రాలు, అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది.మొత్తంగా.. డీలిమిటేషన్‌పై కేంద్రం ముందడుగు వేయనున్న సమయంలో ఖర్గే లేఖ రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి.. రాష్ట్రాలకు సమయం ఇవ్వాలి.. 543 లోక్‌సభ స్థానాలను మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలి.. 2029 నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి అన్న నాలుగు కీలక డిమాండ్లతో కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ అంశంపై కేంద్రం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# కరెంట్ వైర్ల దొంగల ముఠా గుట్టురట్టు

- ఇద్దరి అరెస్ట్, కిలోల కొద్దీ సొత్తు స్వాధీనం

**ప్రజా వాయిస్ హుస్నాబాద్** కోహెడ మండల పరిధిలో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొడుతూ, రైతుల మోటార్ వైర్లను దొంగిలిస్తున్న ముఠా ఆటకట్టించారు కోహెడ పోలీసులు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వెంకటేశ్వరపల్లి, ఆరేపల్లి, బస్వాపూర్ గ్రామ శివార్లలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్, అల్యూమినియం వైర్లను దొంగిలించడంతో పాటు తంగళ్ళపల్లి వద్ద పొలాల్లోని మోటార్ వైర్లను అపహరించినట్లు విచారణలో తేలింది. కరీంనగర్ జిల్లా సోమారం గ్రామానికి చెందిన లోకిని మహేష్, హన్మకొండ గోకుల్ నగర్‌కు చెందిన దేవర రాజశేఖర్ లు దొంగిలించిన వైర్లను ప్యాసెంజర్ ఆటోలో తరలిస్తుండగా, సముద్రాల క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.వారి వద్ద నుంచి ప్రయాణికుల ఆటో, కరెంట్ మోటార్ స్టార్టర్, వైర్లు, సుమారు 10 కిలోల ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్, 100 కిలోల అల్యూమినియం వైర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు వేగవంతం చేశారు.ఈ దొంగతనం ముఠాను చాకచక్యంగా పట్టుకున్న హుస్నాబాద్ సీఐ శ్రీధర్, కోహెడ ఎస్ఐ అభిలాష్, హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ వేణులను హుస్నాబాద్ ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

# వికారాబాద్ రాజకీయాల్లో ఆరోపణల వేడి!

- స్పీకర్‌పై మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సంచలన ఆరోపణలు
- రూ.10 కోట్ల పరువునష్టం నోటీసుతో మరింత ముదిరిన వివాదం
- తండ్రి స్పీకర్.. కుమార్తె మున్సిపల్ చైర్‌పర్సన్.. 'కుటుంబ పాలన'పై విపక్షాల విమర్శలు
- గత ప్రభుత్వంలో మంజూరైన పనుల నిలిపివేతపై బీఆర్ఎస్ ఆరోపణలు
- పెండింగ్ బిల్లులు.. అభివృద్ధి పనులపై రాజకీయ రగడ
- ఎన్నికల హామీలు ఎక్కడ? అంటూ విపక్షాల ధ్వజం
- ఆరోపణలను ఖండిస్తున్న కాంగ్రెస్
- అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని స్పష్టీకరణ
- పరస్పర ఆరోపణలతో హాట్ టాపిక్‌గా మారిన స్థానిక రాజకీయం




**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** వికారాబాద్ ఎమ్మెల్యే, ప్రస్తుత తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పైన, కాంగ్రెస్ ప్రభుత్వ నాయకుల పైన వికారాబాద్ స్థానిక రాజకీయాల్లో ప్రతిపక్షాలు, ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు, రాజకీయ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచిస్తున్నారని, మోసం చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రెస్ మీట్లు నిర్వహించి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పైన, ఆయన కుటుంబం పైన సంచలన ఆరోపణలు చేశారు. వికారాబాద్ మున్సిపాలిటీ వ్యవహారాలను, అధికారాలను స్పీకర్ కుటుంబ సభ్యులు తమ సొంత లాభాల కోసం అదుపు చేస్తున్నారని ఆనంద్ ఆరోపించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయకుండా స్పీకర్ వందల కోట్ల లంచాలు తీసుకున్నారని ఆనంద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తన ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ మెతుకు ఆనంద్‌కు రూ. 10 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసులు జారీ చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**మీది కుటుంబ పాలన కాదా అంటూ విమర్శలు**

వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కుమార్తె గడ్డం అనన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే ఇంట్లో తండ్రి ఎమ్మెల్యే/స్పీకర్‌గా, కుమార్తె మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవులు చేపట్టడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.గతంలో బీఆర్ఎస్ పార్టీని కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్, ఇప్పుడు వికారాబాద్‌లో అదే తరహా "కుటుంబ పాలన" సాగిస్తూ ప్రజలను మోసం చేస్తోందని సోషల్ మీడియాలో మరియు స్థానికంగా విమర్శలు వస్తున్నాయి.

**అభివృద్ధి పనుల నిలిపివేత - పెండింగ్ బిల్లుల వివాదం**

వికారాబాద్ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన, ప్రారంభమైన పలు అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. పాత పనులకు సంబంధించిన నిధులు, కాంట్రాక్టర్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి నియోజకవర్గ ప్రగతిని వెనక్కి నెడుతున్నారని, గెలిచిన తర్వాత ప్రజల అవసరాలను పట్టించుకోవడం లేదని స్థానిక విపక్ష నాయకులు విమర్శిస్తున్నారు.మరోవైపు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు కాంగ్రెస్ శ్రేణులు ఈ ఆరోపణలను తిప్పికొడుతున్నారు. తాము వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు మరియు కోట్ల రూపాయల వ్యయంతో నూతన రోడ్ల నిర్మాణ శంకుస్థాపనలు వేగంగా చేపడుతున్నామని స్పష్టం చేస్తున్నారు.

# ప్రజా వాయిస్ ఎఫెక్ట్



- అల్వాలలో ఐకేపీ సీఏ మానసపై వేటు!
- నకిలీ ట్రక్ షీట్లతో 256 బస్తాల ధాన్యం అక్రమం
- కథనం వెలుగులోకి రాగానే అధికారుల విచారణ
- బాధ్యతారాహిత్యం, విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు
- విధుల నుంచి తొలగిస్తూ పూజ గ్రామైఖ్య సంఘం ఉత్తర్వులు

**ప్రజా వాయిస్ మిరుదొడ్డి:** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో జరిగిన భారీ ధాన్యం కుంభకోణంపై 'ప్రజా వాయిస్' దినపత్రికలో ప్రచురితమైన కథనం తీవ్ర ప్రభావం చూపింది. ఈ వ్యవహారాన్ని పత్రిక ప్రధానంగా వెలుగులోకి తేవడంతో అధికారులు, సంబంధిత బాధ్యులు స్పందించి విచారణను వేగవంతం చేశారు.అల్వాల గ్రామానికి చెందిన కొందరు రైతులు అసలు ధాన్యమే విక్రయించకపోయినా, వారి పేర్లను దుర్వినియోగం చేస్తూ కేటాయించని వాహనం నంబర్‌తో ఏకంగా 256 బస్తాల (102.40 క్వింటాళ్ల) ధాన్యానికి నకిలీ ట్రక్ షీట్లు సృష్టించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైతుల సొమ్మును కాజేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన ఈ అక్రమం తీవ్ర కలకలం రేపింది.ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించడంతో పాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు నిర్ధారణ కావడంతో పూజ గ్రామైఖ్య సంఘం (అల్వాల) ఐకేపీ సీఏ (వీఓఏ) శ్రీమతి సింగం మంగమ్మ అలియాస్ గురప్పగారి మానసపై వేటు పడింది.ధాన్యం విక్రయించని రైతుల పేర్లతో నకిలీ ట్రక్ షీట్లు జారీ చేసి మిల్లుకు సమర్పించిన వ్యవహారంపై ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ పూజ గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శి అధికారిక నోటీసు జారీ చేశారు. ఈ నోటీసు ప్రతిని మిరుదొడ్డి ఏపీఎంకు అందజేశారు.ఐకేపీ కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాలను వెలికితీసి, బాధ్యులపై చర్యలు తీసుకునేలా చేసిన 'ప్రజా వాయిస్' దినపత్రికకు అల్వాల గ్రామ ప్రజలు, బాధిత రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యలపై నిరంతరం నిఘా ఉంచుతూ అక్రమాలను వెలుగులోకి తెస్తున్న ప్రజా వాయిస్ పాత్రికేయ ధర్మానికి ఈ చర్య నిదర్శనమని వారు పేర్కొన్నారు.




ప్రజా వాయిస్
ఇది ప్రజల గొంతుక
05 Jul 2026 - Page 6
ఐకెపి కేంద్రంలో భారీ ధాన్యం కుంభకోణం
- అల్వాలలో నకిలీ ట్రక్ షీట్లతో రైతుల సొమ్ము కాజేసే యత్నం!

# రామగుండంలో రౌడీ షీటర్లతో ప్రజాప్రతినిధుల చెట్టాపట్టాల్!

- కార్పొరేటర్ల నుంచి బడా నేతల వరకు అదే తీరు
- భూ పంచాయతీలు, సెటిల్మెంట్లలో రౌడీల దౌర్జన్యాలు
- సమాజానికి ఏం సందేశమిస్తున్నారు?
- మండిపడుతున్న మేధావులు, ప్రజలు



**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం నియోజకవర్గంలో రౌడీ షీటర్లతో ప్రజాప్రతినిధులు, బడా నేతలు చెట్టాపట్టాలేసుకుని తిరిగే విష సంస్కృతి రోజురోజుకూ పెరిగిపోతోంది. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల వల్ల ప్రజాస్వామ్యానికి, శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిసినా.. కొందరు కార్పొరేటర్లు, నాయకులు వారితో బహిరంగంగా తిరుగుతుండటం గమనార్హం.రౌడీయిజం.. భూ కబ్జాలు!కొందరు రౌడీ షీటర్లు పోలీసుల దృష్టిలో మార్పు వచ్చినట్లు నటిస్తూనే తమ ప్రాంతాల్లో రౌడీయిజం చెలాయిస్తున్నారు.

**"నాకు ఫలానా లీడర్ తెలుసు"**

అని చెప్పుకుంటూ భూ పంచాయతీలు, సెటిల్మెంట్లలో తలదూరుస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండ చూసుకుని దౌర్జన్యాలు, భూకబ్జాలు, బెదిరింపులు, దాడులకు తెగబడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికే ప్రమాదంనేరస్థులతో నాయకులు, కొందరు పోలీసులు కూడా సాన్నిహిత్యంగా ఉండటం వల్ల వీరు ఏం చేసినా చెల్లుతుంది అనే అభిప్రాయం సామాన్య ప్రజల్లో బలపడుతోంది. ఇది ఓటేసి గెలిపించిన లీడర్లపై నమ్మకాన్ని పోగొట్టడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని మేధావులు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**పోలీస్ నిఘా ఏదీ?**

ప్రజాప్రతినిధులు నేరస్థులకు దూరంగా ఉండి చట్టబద్ధంగా వ్యవహరించినప్పుడే సమాజంలో శాంతిభద్రతలు కాపాడబడతాయి. ప్రజాప్రతినిధుల వెంట తిరుగుతున్న రౌడీ షీటర్ల వివరాలను ఆరా తీసి, వారి కార్యకలాపాలపై కఠిన నిఘా పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్‌ను స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లు గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

## టి ఏ జి ఎస్ డిమాండ్

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న రిలే నిరాహార దీక్షలకు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టి ఏ జి ఎస్) కుమురం భీం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. దీక్షలు 100వ రోజుకు చేరిన సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.గత వంద రోజులుగా కార్మికులు పోరాటం చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఏం చేస్తున్నారని టి ఏ జి ఎస్ జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్ ప్రశ్నించారు. లేబర్ కోడ్‌లను సాకుగా చూపి యాజమాన్యం కోర్టుకు వెళుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు. లేబర్ కోడ్‌లే ఎన్నికలకు ఆటంకమైతే రాష్ట్రంలోని మిగతా పరిశ్రమలలో ఎన్నికలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. యాజమాన్యం మొండివైఖరి వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు.కార్మికుల పోరాటానికి ఆదివాసీల మద్దతు కొనసాగుతుందని, భవిష్యత్ పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని నెర్పల్లి అశోక్ ప్రకటించారు. ఎస్పీఎం కార్మికులకు మద్దతుగా మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యాజమాన్యం సంఘాలను విడగొట్టే ప్రయత్నం చేస్తోందని, కొత్త కుంపటి పెట్టే నాయకులు ఆలోచించి ఎన్నికలు సజావుగా జరిగేలా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.





# గౌడ హక్కుల కోసం ఉద్యమిస్తా

- అన్ని సంఘాలను ఏకం చేస్తా
- మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి ములుగు జిల్లా అధ్యక్షుడిగా పైడిమల్ల భాస్కర్ గౌడ్.

**ప్రజా వాయిస్; ములుగు:**/ మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి ములుగు జిల్లా అధ్యక్షుడిగా పైడిమల్ల భాస్కర్ గౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జిల్లా ఇన్‌చార్జి ముంజల రాజేందర్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడిని రాష్ట్ర కమిటీ ఘనంగా సన్మానించింది.

**రాజకీయాలకు అతీతంగా గౌడ జాతి కోసం పోరాటం**
**—— పైడిమల్ల భాస్కర్ గౌడ్.**

ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ జాతి హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తానన్నారు. కుల సంఘాలను రాజకీయ పార్టీలకు తాకట్టు పెట్టకుండా గౌడల హక్కుల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ములుగు ఏజెన్సీ ప్రాంతంలోని గౌడ సొసైటీల పునరుద్ధరణకు కృషి చేస్తానని, త్వరలో గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

**31న కలెక్టర్‌కు గౌడల సమస్యలపై వినతి**

.ఈ నెల 31న ములుగు జిల్లా గౌడల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు భాస్కర్ గౌడ్ తెలిపారు. జిల్లాలోని గౌడలు, గీత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గీత కార్మికుల సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయమైన వాటా సాధించేందుకు మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జిల్లా ఇన్‌చార్జి ముంజల రాజేందర్ గౌడ్, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యల నిలయంగా మారిన మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రి

- వరంగల్ ఖమ్మం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు వైద్యం అందించి
- నాడు పేరు ప్రఖ్యాతులు పొందిన ఎంజీఎం నేటి దుస్థితి కారణమైన వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి, రాజీనామా చేయాలని ప్రజల డిమాండ్,
- గులుకోసుల స్టాండు లేక గోడలకు మొలలు కొట్టి ఎక్కిస్తున్న దృశ్యాలు
- వీల్ చైర్లు లేక రోగులను భుజాలపై ఎత్తుకెళ్తున్న బంధువులు
- ప్రజల కోసం కనీస సౌకర్యాలు కల్పించరా?
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న రోగుల బంధువులు







**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** మొదట గా ఏం జి ఏం లోపలికి వెళ్ళగానే మనకు దర్శనం, గుంతలు గా మారిన రోడ్డులు, సరైన పార్కింగ్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఎమర్జెన్సీ వద్దకు వెళ్ళాలి అంటే పరిస్థితి మరింత దారుణం, గుంతలు పడ్డ రోడ్ల గుండానే అంబులెన్సు వెళ్లాల్సిన పరిస్థితి..ఓ పి తీసుకెనే కాడ ఇబ్బందులు, పడుతున్న రోగులు వెంట వచ్చిన బంధువులు, బాలింతలు వచ్చినప్పుడు,ఫీడింగ్ చేసేందుకు తల్లిపాలు ఇచ్చే గది ఏర్పాటు చేసారు. కానీ ఆ గది మాత్రం తెరువరువు ,ఓ పి తీసుకువడానికి వచ్చిన బాలింతలు ఆరు బయట పిల్లలకు పాలు ఇవ్వాల్సిన పరిస్థితి....ఓ పి తీసుకోని లోపలికి వెళ్ళాక ఎటు వెళ్లాలో తెలియని అడవిలో తిరుగుతున్నామా అని తలపించే పరిస్థితి, చదువుకున్న వారికీ కూడా రూమ్ నంబర్స్ కనుక్కోవడం కష్టమే, ఒక వరుస సంఖ్యలో నంబర్స్ లేకపోవడం తో రొగులు గది నెంబర్ తెలుసుకోవడానికే పుణ్య కాలం కాస్త గడుస్తుంది....ఇక ఎలాగో అలాగా నెంబర్ తెలుసుకొని లైన్ లో నిలబడితే,లోనికి పంపించే వారు రోగులను కనీసం, మనుషుల లెక్క కూడా చూడటం లేదు ఎంజీఎం సిబ్బంది, ఇష్టం వచ్చినట్లు గా తిడుతూ, నెట్టివేస్తున్న పరిస్థితి, ఏమైనా ఇన్ఫర్మేషన్ అడిగితే చెప్పకపోవడమే కాకుండ కసురుకోవడం, ఎంజీఎం సిబ్బంది వల్ల పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.?.డాక్టర్స్ రాసే మందులు దొరకక ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారు, రాసిన మందులు ఎంజీఎం లో దొరకనప్పుడు మరి ఇంత పెద్ద ప్రభుత్వ దావకాన ఎందుకు కట్టినట్టు ప్రభుత్వ సొమ్మంతా ఏమవుతుంది, ఒక పేషెంట్ కి 4 రకాల మందులు రాస్తే ఒకటి, రెండు కూడా దొరకడం కష్టమే అవుతుంది, కానీ ఏం జి ఏం లోన ఉన్న ప్రైవేట్ మందుల షాపులలో మాత్రం దొరుకుతున్నాయి..మందులు తీసుకున్నాక అదే చిత్రమో కానీ, మందులు ఇచ్చే వారు కూడా ఎలా వేసుకోవాలని సరిగ్గా చెప్పరు,దీంతో వృద్ధులు , నిరక్షరాస్యుల వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్న రోగులు..వార్డులలో కనీస సదుపాయాలు లేవు, ఫాన్స్ లేక రొగులు ఇబ్బందులు పడుతున్నారు, తమతో ఇంట్లో నుండి ఫాన్స్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది, కనీసం గ్లూకోస్ బాటిల్స్ పెట్టె స్టాండ్స్ కూడా లేవు, ఆపరేషన్కి వెళ్లే సమయాలలో కూడా పేషెంట్, పేషెంట్ తరుపు బంధువులు,చేతిలో గ్లూకోస్ బాటిల్స్ పట్టుకొని నడుచుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది అంటే ఏం జి ఏం లో ఎలాంటి పరిస్థితి ఉందొ మనకు అర్థం అవుతుంది...ఏం జి ఏం లో అత్యంత దారుణమైన పరిస్థితి ఏంటి అంటే ఆపరేషన్ అనంతరం పేషెంట్ బయటికి వచ్చాక వారి తరుపు బంధువుల దగ్గర డబ్బులు వసూల్ చేస్తున్నారు,లోపల పనిచేస్ వారు, ఒక్క పేషెంట్ దగ్గర 1000ల నుండి 2000 ల లోపు తీసుకుంటున్నారు.. సీసీ కెమెరాలు ఎందుకు పెట్టారు వాటిని ఎందుకు వినియోగించరు లంచం తీసుకునే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?ఇది ప్రభుత్వ ఆసుపత్రినా.. ప్రైవేటు ఆసుపత్ర అయోమయంలో రోగులు. పేషెంట్ కుటుంబాలు ఆవేద వ్యక్తం చేస్తున్నారు, వెయ్యి రూపాయలకు తక్కువ ఇస్తే లంచం తీసుకోవడం లేదు,, డబ్బులు ఇవ్వకుంటే ఆపరేషన్ థియేటర్ నుండి, వార్డు లోకి తీసుకెళ్లడం లేదు, డబ్బులు లేక పోతే లంచానికి ఆన్లైన్ పేమెంట్ కూడా ఎంజీఎం లో కొన్నిచోట్ల తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ హాస్పిటల్ కి వచ్చే పేదవారు తెలిసిన వారికీ ఫోన్ చేసి ఫోన్ పే చేపిస్తున్నరు గతిలేక, గేట్ ల వద్ద ఉండే సెక్యూరిటీ వాళ్ళ మామూళ్లు మాములే ...

**వీల్ చైర్ లేక రోగిని భుజాల మీద తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు..**

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో దయనీయ పరిస్థితులువరుస ఘటనలు వెలుగులోకి వస్తున్నా మొద్దు నిద్ర వీడని వైద్యశాఖ...రోగిని ఎక్స్‌రేకు తీసుకెళ్లేందుకు వీల్‌చైర్ లేకపోవడంతో, భుజాలపై మోసుకెళ్లిన కుటుంబ సభ్యులు రోగులకు కనీస వసతులు కల్పించలేని ప్రభుత్వం ఎందుకని మండిపడుతున్న ప్రజలు.. ఇప్పటికైనా రోగులకు సేవలు అందించని పరిశుభ్రత పాటించని అధికారులు. సిబ్బందిపై తక్షణమే చర్య తీసుకోవాలని వెంటనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజీనామా చేయాలని నూతన మంత్రిని నియమించాలని రోగులు.రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.



## దొమ్మాటలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

- బీజేపీ, బీఆర్ ఎస్ ల నుంచి 22 మంది చేరిక

ప్రజా వాయిస్, దుబ్బాక సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి భారీ బలం చేకూరింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 22 మంది ప్రముఖ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆయన నూతనంగా చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం ఇక్కడ కాంగ్రెస్ బలోపేతానికి నిదర్శనమని ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పార్టీ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్క కార్యకర్తా కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు.ఈ విశేష కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడాల రాములు, సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు స్వామి, తిరుమలాపూర్ సర్పంచ్ బండారు లాలు, మాచినపల్లి సర్పంచ్ బొక్కల నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ అన్నారెడ్డి సంపత్ రెడ్డిలతో పాటు పడాల మల్లేశం, దాకోల్ల ఆంజనేయులు గౌడ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇక అందోల్ కాదు జహీరాబాద్

- అక్కడినుంచి పోటీ చేసేందుకే ఆసక్తి చూపుతున్న మంత్రి దామోదర్
- ఆందోల్ నుంచి ఆయన కూతురు త్రిష...?
- మంత్రి తీరుపై ఆందోల్ లో తీవ్ర వ్యతిరేకత
- దానికోసమే ఉజ్వల్ రెడ్డికి డిసిసి పదవి కోసం పట్టు





**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** గత పది సంవత్సరాలుగా అధికారంలో టిఆర్ఎస్ పార్టీ ఉన్నప్పటికీ ఎప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాకపోతుందన్న ఆశతో కార్యకర్తలు, నాయకులు ఎదురు చూశారు. దానికి తోడు మంత్రి దామోదర్ కూతురు త్రిష ఎలాగైనా తండ్రిని గెలిపించుకోవాలనే లక్ష్యంతో ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందు నుంచి దామోదర్ ఫౌండేషన్ పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో ఉత్సాహాన్ని నింపుతూ వారంలో ఒక రోజు ఏదో ఒక మండల్ లో పర్యటిస్తూ వచ్చింది. దీంతో యువతలో జోష్ పెరిగి కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత మంత్రి దామోదర్ రాజనర్సింహ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. ఎన్నికలు అయ్యాక 23 వేల మెజార్టీతో మంత్రి గెలిచిన మంత్రి గాని, ఆయన కూతురు త్రిష దామోదర్ గుర్తించకపోవడంతో యువత తీవ్ర నిరాశలో ఉన్నారు. అసలు రెండుకు చెడ్డ రేవడిలా తమ పరిస్థితి మారింది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఎన్నికల సమయంలో కష్టపడ్డ కార్యకర్తలు, నాయకుల కంటే టిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్లో చేరిన వారికి అధిక ప్రాధాన్య ఇస్తున్నారని ప్రధాన విమర్శలు ఉన్నాయి. దానికి తోడు మంత్రి కార్యాలయంలో ఉండే వ్యక్తిగత పీఏలు సైతం కష్టపడ్డ కార్యకర్తలను వదిలేసి తమకు డబ్బులు ఇచ్చే వారికే పనులు చేసి పెడుతున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలుస్తారో చూస్తామంటూ సొంత పార్టీ నేతలే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సంగారెడ్డి జిల్లాలోని మరో ఎస్సీ నియోజకవర్గమైన జహీరాబాద్ లో 2029 ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే తమ క్యాడర్ను తయారు చేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఇప్పటికిప్పుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలు జరిగితే ఎలాగైనా తనకు అనుకూలమైన వ్యక్తిని అధ్యక్షునిగా ఎన్నుకోవాలని ఉద్దేశంతో పార్లమెంటు ఇంచార్జ్ ఉజ్వల్ రెడ్డిని డిసిసి అధ్యక్షునిగా చేసేందుకు మంత్రి దృష్టి పెట్టారు. కానీ అక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ మంత్రి చంద్రశేఖర్ దామోదర్ 2029 లో అక్కడి నుంచి పోటీ చేస్తే చంద్రశేఖర్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది కూడా ఒక ప్రశ్న.. ఇందుకోసం తాను జహీరాబాద్ నుంచి.. తన కూతుర్ని ఆందోల్ నుంచి పోటీ చేయించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు విశ్వాసనీయంగా తెలిసింది. రెండు సీట్లు ఒకే కుటుంబం కి ఇవ్వడం సాధ్యమా అంటే అది కాంగ్రెస్ పార్టీలో కొత్తేమీ కాదు. ఎలాగైనా జహీరాబాద్లో దామోదర్... అందోల్ లో ఆయన కూతురు త్రిష దామోదర్ ను పోటీలో దింపాలన్న వ్యూహం తోనే జిల్లా అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ మంత్రి దామోదర్ జయరాబాద్ నుంచి పోటీ చేసిన... ఆయన కూతురు త్రిష దామోదర్ ఓటమి చెందక తప్పదని చెప్పవచ్చు. ఎందుకంటే నమ్మిన కార్యకర్తలను మోసం చేసి పదవిలోకి వచ్చాక లేక్క చేయకపోవడం పట్ల కార్యకర్తలు నాయకులు ఉన్నారు. తమ సత్తా ఏమిటో వచ్చే ఎన్నికల్లో చూపెడతామనే భావనతో ఉన్నారనేది స్పష్టం.



## పీడీఎస్ బియ్యంపై పోలీసుల ఉక్కుపాదం

- పాలకుర్తి పోలీసుల తనిఖీల్లో 40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
- రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తింపు
- ఎస్సై దూలం పవన్ కుమార్

**ప్రజా వాయిస్/పాలకుర్తి** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోపేదలకు ప్రభుత్వం అందించే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై పాలకుర్తి పోలీసులు కొరడా ఝుళిపించారు. పోలీసుల తనిఖీల్లో మొత్తం 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది.పట్టుబడిన బియ్యాన్ని రెండు వాహనాల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. TS07UN5612 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ వాహనానికి సంబంధించిన వివరాల్లో యజమాని డ్రైవర్గా మహేష్ రాజపేట, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు.అదే విధంగా TS08UB9032 నంబర్ గల మరో వాహనంలో సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రెండు వాహనాలను అదుపులోకి తీసుకుని బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలించే దందాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులు, మధ్యవర్తులు, కొనుగోలుదారులపై కూడా సమగ్ర విచారణ జరిపితే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.40 క్వింటాళ్ల బియ్యం పట్టుబడటంతో పాలకుర్తి పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై మరోసారి చర్చ మొదలైంది.

## సమాజాభివృద్ధికి జర్నలిస్టులే కీలకం

- తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి
- జర్నలిస్టుల ఇండ్ల బిల్లుల మంజూరీకి కృషి చేస్తాం:
- విష్ణువర్ధన్ రెడ్డి హామీ
- నారాయణఖేడ్‌లో ఘనంగా టీ డబ్ల్యూ జే హెచ్ 143 సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ప్రజా వాయిస్ నారాయణఖేడ్** నారాయణఖేడ్ పట్టణంలోని కార్తికేయ రెస్టారెంట్ లో ఏర్పాటుచేసిన టిడబ్ల్యూజేహెచ్ 143 సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తో కలిసి పాల్గొని మాట్లాడారు.ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పది. రైతుల,విద్యార్థుల,నిరుద్యోగం, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అనేక విషయాలను జర్నలిస్టులే వెలుగులోకి తీసుకువస్తారన్నారు.జర్నలిజాన్ని ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అని అంటారు. ఎందుకంటే ప్రజలకు సరైన సమాచారం అందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జర్నలిస్టులు సహాయపడతారన్నారు. కానీ ప్రస్తుతం జర్నలిస్టులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారని అట్టి సమస్యలు పరిష్కరించడంలో టిడబ్ల్యూజేహెచ్ 143 ఎల్లప్పుడు ముందుంటుందని చెప్పారు. నారాయణ ఖేడ్ లో ఇండ్ల నిర్మాణ బిల్లులకు సంబంధించి త్వరలోనే ఎంపీ,ఎమ్మెల్యేతో మాట్లాడి జర్నలిస్టులకు బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి టీయూడబ్ల్యూజే ఉమ్మడి మెదక్ జిల్లా జనరల్ సెక్రటరీ యాదగిరి గౌడ్ టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యుడుశ్రీధర్ గౌడ్,పరుశురామ్,రాము జిల్లా నేతలు, నారాయణఖేడ్ అధ్యక్షులు అమృత్, ఉపాధ్యక్షులు పరమేష్, జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, సంఘం బాధ్యులు పాల్గొన్నారు





## పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్ మెంట్ తక్షణమే విడుదల చేయాలి

- బీజేపీ పట్టణ అధ్యక్షులు హరిగోపాల్
- లక్షెట్టిపేటలో దిష్టిబొమ్మ దహనం

ప్రజా వాయిస్ , మంచిర్యాల జిల్లా, లక్షెట్టిపేట / రాష్ట్ర ప్రభుత్వం40 లక్షల మంది విద్యార్థులకు పెండింగ్ లోఉన్న15 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు హరి గోపాల్ డిమాండ్ చేశారు.గురువారం బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హేమంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి రమేష్ జైన్, ప్రధాన కార్యదర్శులు బొక్కనపల్లి సతీష్,మంద రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు గంజాయి వినియోగం, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు



**ప్రజా వాయిస్ దేవాపూర్**/బెల్లంపల్లి దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విశ్వసనీయ సమాచారం మేరకు బెల్లంపల్లి నివాసి ఎస్.కె. జమీర్ దేవాపూర్ ఎం.పీ.పీ. ఎస్ పాఠశాల ముందు అనుమానాస్పదంగా నల్లరంగు కవర్‌తో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న నల్లరంగు కవర్‌ను పోలీసులు తనిఖీ చేయగా, అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అతని వద్ద నుండి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని విచారించగా, తన పేరు ఎస్.కె జమీర్, వృత్తి: కూలీ, నివాసం: బెల్లంపల్లి బస్తీ అని తెలిపాడు. అదేవిధంగా, తనకు తెలిసిన గంజాయి వినియోగదారులైన ఏ2)యం.డి. యోనిస్, ఏ3)చంటి, ఏ4)బన్ని, ఏ5)తాజ్ బాబా, ఏ6)విష్ణు, ఏ7)కిరణ్, ఏ8)సమీర్, ఏ9)అజయ్ వీరు బెల్లంపల్లి నివాసులు, గంజాయిని విక్రయించి డబ్బులు సంపాదించే వాడినని విచారణలో వెల్లడించాడు.ఈ మేరకు నిందితుడు ఏ1) ఎస్.కె జమీర్ పై (ఎన్.డి.పి.ఎస్) (యాక్ట్) లోని సెక్షన్ 8(సి) ఆర్/డబ్ల్యూ 20(బి)(2)(ఏ), 27(బి) కింద దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అలాగే, మిగిలిన వ్యక్తులైన ఏ2 నుండి ఏ9 వరకు వారిపై (ఎన్.డి.పి.ఎస్) (యాక్ట్) లోని సెక్షన్ 27(బి) కింద కేసు నమోదు చేశారు.తదుపరి చట్టపరమైన ప్రక్రియ అనంతరం నిందితుడు ఎస్.కె జమీర్ ను 27.08.2026న కోర్టులో హాజరుపరచి, లక్సెట్టిపేట జైలుకు రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా దేవాపూర్ ఎస్ఐ ఎ. గంగారం మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం కావడంతో పాటు, కుటుంబాలపై మరియు సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ ఎ. గంగారం తెలిపారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**.ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను గురువారం ఆదేశించారు. ఐడిఓసీ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలుదుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు.గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు,వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## మిరుదొడ్డిలో కలకలం రేపుతున్న ఓటర్ల నోటీసులు

- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే 800 మందికి నోటీసులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం

**ప్రజా వాయిస్ మీరుదొడ్డి** మిరుదొడ్డి మండల కేంద్రంలో ఓటరు నమోదు మరియు పరిశీలన ప్రక్రియ స్థానిక ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, క్షేత్రస్థాయి పరిశీలన లోపం కారణంగా ఓటరు జాబితాలో అనేక తప్పులు దొర్లాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి స్పష్టమైన కారణాలు తెలపకుండానే మండల కేంద్రంలోని సుమారు 800 మంది ఓటర్లకు ఒక్కసారిగా నోటీసులు జారీ చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా ఉన్నప్పటికీ ఈ నోటీసులు ఎందుకు ఇచ్చారో అర్థం కాక ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు.ఈ విషయమై వివరణ కోరేందుకు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లిన బాధితులకు అక్కడి సిబ్బంది నుంచి నిరాశే ఎదురవుతోంది. నోటీసుల వెనుక ఉన్న కారణాలు గానీ, వాటికి ఎలా సమాధానం ఇవ్వాలనే మార్గదర్శకాలు గానీ తెలపకుండా సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ సమాధానాన్ని దాటవేస్తున్నారని ఓటర్లు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పైస్థాయి అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన జరిపించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నోటీసులు అందుకున్న ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# దివ్యాంగ బాలబాలికలకు ఆటల పోటీలు

## విజేతలకు బహుమతులు ప్రధానం

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐదు నుండి పదిఏడు సంవత్సరాల లోపు దివ్యాంగ బాలబాలికలకు మండల స్థాయి ఆటల పోటీలను గురువారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలకు జిగ్ జాగ్ వాక్, డక్ వాక్, ఫ్రాగ్ జంప్, చెస్, క్యారంస్, పరుగు పందెం వంటి పలు రకాల ఆటలను నిర్వహించారు. అనంతరం విజేతలతో పాటు పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి ఆటలకు సిఫారస్ చెయ్యనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పండ్లు, భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్, హెచ్ఎం టి లక్ష్మీనరసయ్య, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు జి నాగరమేష్, ఐఆర్పిలు ఆర్ సాంబశివరావు, జె శ్రీనివాస్, పాపకొల్లు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్కె మీరా సాహెబ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా వాణి సమస్యల పైన స్పందించిన పౌరసరఫరాల శాఖ

**ప్రజా వాయిస్ - నెన్నెల** నెన్నెల మండలంప్రజా వాణి కార్యక్రమంలో భాగంగా నెన్నెల గ్రామానికి చెందిన పలువురు శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లులో సుమారు రూ.4.79 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి నష్టం వాటిల్లితే ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.నందులపల్లిలో ఉన్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లును గురువారం పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తనిఖీ చేశారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. మిల్లుకు సంబంధించిన వ్యవహారంలో నెన్నెల మండలానికి చెందిన ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడి పేరు వినిపిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలు అధికారిక విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.




# కాగజ్‌నగర్‌లో దొంగల దందా

- లిక్కర్ మార్ట్ లో చోరీ

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో దొంగలు వ్యాపార కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలోని త్రినేత్ర లిక్కర్ మార్ట్‌లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది.సీసీ ఫుటేజీ ప్రకారం తెల్లవారుజామున 4:25 గంటలకు నలుగురు సభ్యుల ముఠా షాపు వద్దకు చేరుకుంది. ఓ వ్యక్తి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించగా, మిగిలిన ముగ్గురు బయట కాపలాగా నిలిచారు. గల్లా పెట్టెను పగులగొట్టి రూ.3 వేల నగదుతో పాటు రెండు లిక్కర్ బాటిళ్లను ఎత్తుకెళ్లారు.విషయం గుర్తించిన షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు.



# కన్నెపల్లి మండలంలో అధ్వానంగా రహదారులు

- గుంతలమయమైన రోడ్లతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- 15 రోజులుగా ఆర్టీసీ బస్సులకు అంతరాయం

**ప్రజా వాయిస్ - కన్నెపల్లి** కన్నెపల్లి మండలం పరిసర ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారడంతో పాటు వర్షపు నీరు గుంతల్లో నిలిచి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్ల దుస్థితి కారణంగా గత 15 రోజులుగా ఆర్టీసీ బస్సులు సైతం మండల కేంద్రానికి సక్రమంగా రాకపోకలు సాగించలేకపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలు రహదారులపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.రోడ్లకు కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు కోరుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారులను పరిశీలించి, గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గళమెత్తిన యువత...మారాల్సిన పాలనా వ్యవస్థ

- జంతర్ మంతర్ నుంచి రాంచీ వరకు ప్రశ్నిస్తున్న యువతరం
- యువత పోరుబాటతో కదిలిన వ్యవస్థ!




**ప్రజా వాయిస్, హుజూర్ నగర్,** ఆగష్టు 27పాలనా వైఫల్యాలు, నిరుద్యోగం, నిర్లక్ష్యంపై దేశవ్యాప్తంగా యువత తమ నిరసన గళాన్ని వినిపిస్తోంది. తమ భవిష్యత్తును ప్రశ్నిస్తూ రోడ్లెక్కిన యువత ఆగ్రహం ఇప్పుడు పాలకులపై ఒత్తిడి పెంచుతుంది దేశవ్యాప్తంగా యువతలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు ఉద్యమాల రూపం దాల్చుతోంది. ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, పరీక్షా వ్యవస్థలో లోపాలు, అవకాశాల కొరత, విద్య ఖరీదవడం వంటి సమస్యలపై యువత సాగిస్తున్న పోరాటాలు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నాయి. తాజాగా ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జెన్‌జీ యువత చేపట్టిన నిరసనలు, రాంచీలో ఉద్యోగార్థులు సాగించిన ఉద్యమం ఈ పరిణామానికి తాజా ఉదాహరణలుగా నిలిచాయి. జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపై యువత సుమారు 25 రోజుల పాటు ఆందోళన చేయడంతో ప్రభుత్వం 44 నియామక పరీక్షలను రద్దు చేసి, మరికొన్ని పరీక్షలను వాయిదా వేసింది. 2014 నుంచి జరిగిన 17 పరీక్షలు, ఫలితాలు, నియామకాలపై సీఐడీ దర్యాప్తునకు కూడా ఆదేశించింది. ఇది కేవలం ఒక రాష్ట్రానికి పరిమితమైన పరిణామం కాదు. యువత తమ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాల్లో ఇక ప్రేక్షకులుగా ఉండేందుకు సిద్ధంగా లేరనే సంకేతం. అధికారంలో ఉన్నది ఏ పార్టీ అయినా, తమ హక్కులకు భంగం కలిగితే ప్రశ్నించేందుకు యువత ముందుకు వస్తోంది.

### తగ్గుతున్న అవకాశాలు.. పెరుగుతున్న ఆందోళన

దేశంలో యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు సహా స్థిరమైన ఉపాధి అవకాశాలు పరిమితమవుతున్న సమయంలో పోటీ మాత్రం అంతకంతకూ పెరుగుతోంది. ఒక ఉద్యోగం కోసం వేలాది మంది పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంవత్సరాల తరబడి పరీక్షలకు సిద్ధమై, కోచింగ్‌లకు లక్షల రూపాయలు ఖర్చు చేసి, చివరకు పరీక్షలే రద్దయినా, ఫలితాలు వివాదాస్పదమైనా.. ఆ నష్టాన్ని భరించాల్సింది మాత్రం నిరుద్యోగ యువతే.ఇక నాణ్యమైన విద్య సామాన్య కుటుంబాలకు భారంగా మారుతోంది. మరోవైపు కృత్రిమ మేధ (AI) వేగంగా విస్తరిస్తుండటం, ప్రపంచ ఆర్థిక పరిణామాలు, ఉద్యోగాల స్వరూపంలో మార్పులు యువతలో భవిష్యత్తుపై కొత్త ఆందోళనలను పెంచుతున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కొద్దిపాటి అవకాశాలను కూడా ప్రభుత్వ వ్యవస్థల అసమర్థత, అవినీతి, నిర్లక్ష్యం కారణంగా కోల్పోవాల్సి వస్తే యువత ఆగ్రహం చెందడం సహజమే.

### ప్రభుత్వాల మొండితనం.. ఆగ్రహానికి ఆజ్యం

యువత సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు తొలుత వారి ఆవేదనను పట్టించుకోకపోవడం, ఉద్యమాన్ని తేలిగ్గా తీసుకోవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. తమ డిమాండ్లలో న్యాయం ఉందని భావించే యువతకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడం పుండుమీద కారం చల్లినట్లవుతోంది.రాంచీలో జరిగిన పరిణామం దీనికి ఉదాహరణ. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, అవకతవకలపై న్యాయమైన దర్యాప్తు కోరుతూ యువత చేసిన ఆందోళన చివరకు ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపింది. అయితే పరీక్షలు రద్దు చేయడంతో సమస్య పూర్తిగా పరిష్కారమైనట్టు కాదు. ఇప్పటికే ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల భవిష్యత్తు కూడా అనిశ్చితిలో పడింది.

### పోరాటం విజయం.. కానీ పరిష్కారం ఇంకా దూరమే

యువత ఉద్యమాలతో ప్రభుత్వాలు నిర్ణయాలు మార్చుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రజా ఉద్యమాల శక్తిని చూపుతోంది. కానీ ప్రతి సమస్యకు ఉద్యమమే పరిష్కారంగా మారకూడదు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడం, నియామక ప్రక్రియను అవినీతికి తావులేకుండా రూపొందించడం, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ప్రభుత్వాల కనీస బాధ్యత.ఒక పరీక్ష రద్దు చేసి మరో పరీక్ష నిర్వహించడం కంటే, తప్పులు పునరావృతం కాకుండా వ్యవస్థలోనే సమూల మార్పులు తీసుకురావాలి. పరీక్షల నిర్వహణలో సాంకేతిక భద్రత, జవాబుదారీతనం, స్వతంత్ర పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలి.

### యువతను అణచడం కాదు.. అర్థం చేసుకోవాలి

దేశంలో యువత సంఖ్య అధికంగా ఉంది. వారి శక్తిని నిరసనల వైపు నెట్టడం కంటే దేశ నిర్మాణం వైపు మళ్లించాల్సిన బాధ్యత పాలకులదే. యువత ప్రశ్నిస్తే దాన్ని ప్రభుత్వ వ్యతిరేకతగా చూడకూడదు.యువత ఉద్యమిస్తే దాన్ని అణచివేయాలని చూడకూడదు. వారి ఆవేదనలోని నిజాన్ని గుర్తించి పరిష్కరించాలి. ఎందుకంటే నేటి యువత అడుగుతున్నది ప్రత్యేక హక్కులు కాదు తమ కష్టానికి తగిన అవకాశం, తమ ప్రతిభకు తగిన గుర్తింపు,తమ భవిష్యత్తుకు భద్రత.జంతర్‌మంతర్ నుంచి రాంచీ వరకు వినిపిస్తున్న యువత గళం ఇదే చెబుతోంది అవకాశాలు ఇవ్వండి, వ్యవస్థను ప్రక్షాళన చేయండి, న్యాయం చేయండి.లేకపోతే ఓటు హక్కుతో పాటు ప్రశ్నించే హక్కును కూడా బలంగా వినియోగించే తరం దేశ రాజకీయాలను, పాలనా విధానాలను మరింతగా ప్రభావితం చేయడం ఖాయం.



# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

**జా వాయిస్ కామారెడ్డి** కామారెడ్డి నియోజకవర్గంలోని అంతంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన సొసైటీ చైర్మన్‌గా చిట్టెడి సుధాకర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు ఆర్థికంగా బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.రైతులకు అవసరమైన పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలోవిండోలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి తదితర గ్రామాల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, అంతంపల్లి సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి, లింగారెడ్డి, బిక్కనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు భూమని బాలరాజ్, తాటిపాముల లింబాద్రి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి

- పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, గండ్ర జ్యోతి..

**ప్రజా వాయిస్ భూపాలపల్లి జిల్లా** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పాలనలో జరిగిన మోసాలు, నెరవేర్చని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమం పై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి , వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ & భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యాచరణ పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు ఎంతవరకు అమలు చేశారో ప్రజలకు వివరించాలని, అమలుకు నోచుకోని హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో బాకీ కార్డులతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ఎండగట్టాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఏం చేసిందో, ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేసిందో ప్రజల ముందు స్పష్టంగా ఉంచాలని అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని బాకీ కార్డుల ద్వారా తెలియజేయాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 21 టన్నుల అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత.. నలుగురు అరెస్ట్

- అవంతిపురం రైస్ మిల్లుపై పోలీసుల ఆకస్మిక దాడులు
- 420 బస్తాల్లో ఉన్న 21 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం
- బియ్యం రవాణాకు ఉపయోగించిన ఐషర్ మినీ డీసీఎం సీజ్
- పాలిష్ చేసి రీప్యాకింగ్ ద్వారా విక్రయానికి యత్నం
- ప్రధాన నిందితుడిపై ఇప్పటికే 13 కేసులు నమోదు



**ప్రజా వాయిస్, మిర్యాలగూడ.**మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 21 టన్నుల ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేశారు. అవంతిపురం గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ గణపతి ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్ వద్ద ఈ అక్రమ వ్యవహారం వెలుగుచూసింది.మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ. లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు ఆగస్టు 26వ తేదీ సాయంత్రం సుమారు 4:30 గంటలకు పోలీసులు రైస్ మిల్‌లో తనిఖీలు నిర్వహించారు. తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు అక్రమంగా కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించి నిల్వ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించామని. అనంతరం ఆ బియ్యాన్ని పాలిష్ చేసి, ఇతర బస్తాల్లో రీప్యాకింగ్ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు.ఈతనిఖీల్లో 50 కిలోల చొప్పున ఉన్న 420 బస్తాల్లో సుమారు 21 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నమని . బియ్యం రవాణాకు ఉపయోగించిన ఐషర్ మినీ డీసీఎం వాహనం నంబర్ TS 05 UF 6431ను కూడా పోలీసులు సీజ్ చేశామని తెలిపారు.ఈ కేసులో సోమ రామకృష్ణ, చిమట వెంకన్న, చిమట లోకేష్, సయ్యద్ నదీమ్‌లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు సోమ రామకృష్ణ వివిధ తెల్ల రేషన్ కార్డుదారుల వద్ద నుంచి పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వెంకన్న, లోకేష్‌లు బియ్యం పాలిష్, రీప్యాకింగ్‌లో సహకరిస్తుండగా, నదీమ్ డ్రైవర్‌గా బియ్యం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.ప్రధాన నిందితుడు సోమ రామకృష్ణపై గతంలో కూడా పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, వ్యాపారానికి సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా దుర్వినియోగం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ.హెచ్చరించారు. ఈ అక్రమ వ్యాపారంలో మరికొందరి పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.



# చిన్న వానకు రాకపోకలు బంద్

### పట్టించుకోని పాలకులు, ఇబ్బందుల్లో ప్రజలు

**ప్రజా వాయిస్ - బెల్లంపల్లి** బెల్లంపల్లి మండలంలోని అకేనపల్లి గ్రామం నేతకాని వాడకు వెళ్ళే దారిలో తూకుంట వాగుపై వానొస్తే రాకపోకలకు చాలా ఇబ్బంది అవుతుంది.ముఖ్యంగా స్కూలు పిల్లలకు వగు దాటుట కష్టంగా ఉంది. ఎన్నోసార్లు గ్రామసభలో చర్చించినా ఫలితం శూన్యం.పాలకులు, అధికారులు స్పందించి వాగు పైనా వంతెన నిర్మించి రాకపోకలను సులభతరం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు

# ర్యాలీప్రో వద్ద లభించిన రెండు కిలోల గంజాయి ఎక్కడ...?

- కార్మికుడి బ్యాగులో దొరికిన ఎండు గంజాయి మాయంపై ప్రశ్నలు
- గంజాయి సరఫరా మూలాలపై ఎక్సైజ్, పోలీసుల విచారణకు డిమాండ్
- సఘటన బయటపడటంతో కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు
- గంజాయి సేవిస్తే పరిశ్రమలోకి అనుమతించ బోమని హెచ్ఆర్ వెల్లడి
- చందాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి విక్రయాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్





**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ పారిశ్రామిక ప్రాంతంలోని ర్యాలీప్రో పరిశ్రమ వద్ద ఓ కార్మికుడి వద్ద లభించినట్లు ఆరోపణలు వచ్చిన రెండు కిలోల ఎండు గంజాయి ప్రస్తుతం ఎక్కడ ఉంది..? ఎవరి వద్ద ఉంది..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై సంబంధిత పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.సమాచారం ప్రకారం, ఓ కార్మికుడు విధులకు వెళుతున్న సమయంలో అతని వద్ద ఉన్న బ్యాగులో సుమారు రెండు కిలోల ఎండు గంజాయితో పాటు నిషేధిత పదార్థాలు లభించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి ఆధారాలతో, గంజాయి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఫొటోతో సహా ప్రజా వాయిస్ వార్తను ప్రచురించింది. ఈ సమాచారం ఇతర ప్రధాన మీడియా, డిజిటల్ మీడియాల్లో పెద్దగా వెలుగులోకి రాకపోవడం గమనార్హం.ఈ ఘటనపై హత్నూర పోలీసులకు, నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించినప్పటికీ, సకాలంలో స్పందన లేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన ప్రాంతంలోనే ఉండి పూర్తి వివరాలను సేకరించడం సమాచారదాతలు, జర్నలిస్టులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున కొన్ని కీలక వివరాలను గోప్యంగా ఉంచాల్సి వచ్చిందని తెలుస్తోంది.ఘటన వెలుగులోకి వచ్చిన అనంతరం పరిశ్రమలో ఈ విషయం బయటకు ఎలా వెళ్లిందనే అంశంపై యాజమాన్య వర్గాలు ఆరా తీసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సంఘటన జరిగిన రోజు ఎంత మంది కార్మికులు విధులకు హాజరయ్యారు..? ఎవరు అక్కడ ఉన్నారు..? అనే వివరాలు సేకరించడంతో పాటు కొందరి మొబైల్ ఫోన్లలో ఫొటోలు పరిశీలించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఘటనకు సంబంధించి వార్తా సేకరణ కోసం అక్కడికి వెళ్లిన ప్రజా వాయిస్ జిల్లా ప్రతినిధి స్వయంగా ఫొటోలు తీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో అసలు విషయాన్ని వెలికి తీయకుండా అమాయక కార్మికులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మరోవైపు, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించిన వారిని పరిశ్రమలోకి అనుమతించబోమని ర్యాలీప్రో పరిశ్రమ హెచ్ఆర్ స్పష్టం చేసినట్లు సమాచారం. పరిశ్రమలో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, మత్తు పదార్థాలు సేవించి విధులకు హాజరయ్యే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నట్లు తెలిసింది.అయితే అసలు ప్రశ్న మాత్రం——కార్మికుడి వద్ద లభించినట్లు చెబుతున్న రెండు కిలోల గంజాయి ఇప్పుడు ఎక్కడ ఉంది..? దానిని ఎవరి ఆధీనంలో ఉంచారు..? దానికి సంబంధించి కేసు నమోదు చేశారా..? స్వాధీనం చేసుకున్నట్లు అధికారిక రికార్డులు ఉన్నాయా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.పరిశ్రమ వద్ద గంజాయి లభించినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో అది అక్కడికి ఎలా చేరింది..? ఎవరు సరఫరా చేస్తున్నారు..? పారిశ్రామిక ప్రాంతంలో ఇంకెవరికైనా విక్రయాలు జరుగుతున్నాయా..? అనే కోణాల్లో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని ప్రజా వాయిస్ డిమాండ్ చేస్తోంది. ఒక్క సంఘటనతోనే వ్యవహారాన్ని ముగించకుండా గంజాయి సరఫరా వెనుక ఉన్న మూలాలను గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతోంది.చందాపూర్ పారిశ్రామిక ప్రాంతంతో పాటు నర్సాపూర్ పరిసరాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిగితేనే రెండు కిలోల గంజాయి వ్యవహారంపై ఉన్న అనుమానాలు తొలగడంతో పాటు, పారిశ్రామిక ప్రాంతాల్లో మత్తు పదార్థాల సరఫరా వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

**ప్రజా వాయిస్ సిర్పూర్ టి** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-టి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు టి ఎస్ 20 టి 7422 నంబర్ వాహనాన్ని తనిఖీ చేయగా, అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న 33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది.బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కన్నెపల్లి గ్రామానికి చెందిన మోర్లే మధుకర్ (42)ను అదుపులోకి తీసుకుని, బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బయ్యారం లో మర్రి చెట్టుకు మర్రి కల్లు

.**ప్రజా వాయిస్, బయ్యారం**.. మహబూబాబాద్ జిల్లా,బయ్యారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ని చిన్నాల కుంట చెరువు వద్ద మర్రి చెట్టు వేరు నుండి కళ్ళు రావడం చూసి గీత కార్మికుడు నాలుగైదు రోజుల నుండి దానిని పరిశీలించగా ప్రధాన వేరు నుండి మర్రి కళ్ళు రావడానికి చూసి ఆశ్చర్యానికి లోనై వేరుకు గీత కత్తితో గీతలు పెట్టి కల్లు లొట్టిని కట్టారు. లొట్టిలో కళ్ళు పడటం చూసి పలువురు మర్రి కల్లు తాగేందుకు క్యూలు కడుతున్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ కావడంతో పలువురు ఆ చెట్టును చూడటానికి వెళుతున్నారు. దీనిపై గీత కార్మికుడు ఆకుల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం మర్రిచెట్టు పక్కనే గండు పెద్ద వెంకన్న వ్యవసాయ బావి పాడుబడి పూడిక తో ఉండడంతో ఏలిననో ప్రభావంతోతన వారి సాగు పొలానికి నీరు సరిపోక పోవడంతో తన బావిని ప్రోక్లిన్ సహాయంతో పూడిక పనులు చేశారు . పూడిక తీస్తున్న సందర్భంలో పక్కనే ఉన్న మర్రి



పెద్ద వేరు తెగి పోవడం వల్ల, వేరు నుంచి మూడు నాలుగు రోజులుగా మర్రి కల్లు జాలు వారడం చూశానని తెలిపాడు.మర్రికల్లును తీసి విక్రయిస్తున్నట్లు గీత కార్మికుడు తెలిపాడు..

# గుర్రంపోడు మండలంలో పలు ప్రభుత్వ బడుల్లో టీచర్ల కొరత!

- సబ్జెక్టుకో ఉపాధ్యాయుడు లేరు
- పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రుల భయం
- ఖాళీ పోస్టులు భర్తీ చేయరా విద్యార్థుల భవిష్యత్తుపై అధికారుల నిర్లక్ష్యమెందుకు

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు** మండలం గుర్రంపోడు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారింది. ఒక సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు ఉంటే మరో కీలక సబ్జెక్టుకు టీచర్ లేకపోవడంతో పూర్తిస్థాయి బోధన అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చదువుల పరిస్థితిపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయడంతో పాటు, ప్రతి సబ్జెక్టుకు తగిన ఉపాధ్యాయులను అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# రూ.40 లక్షల ఉపాధి నిధులు సమాధి

- అధికారుల బాధ్యతారాహిత్యానికి ఇదో నిదర్శనం!
- అప్పుడు ఎనిమిదేళ్లు.. ఇప్పుడు పదేళ్లు!
- మారని 'మినీ గోదాం' తలరాత!
- 2014-15లో ఉపాధి హామీ కింద రూ.40 లక్షలు మంజూరు
- 2015లో శంకుస్థాపన అప్పటి నాయకులు
- కాంట్రాక్టర్ల వివాదాలు, పర్యవేక్షణ లోపంతో పది సంవత్సరాలుగా నిలిచిపోయిన పనులు
- కోట్ల విలువైన ధాన్యం వర్షార్పణం
- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు



**ప్రజా వాయిస్ ముత్తారం** అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల లాభాపేక్ష, పాలకుల నిర్లక్ష్యానికి ఖమ్మంపల్లిలోని మినీ గోదాం నిర్మాణం సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 2022 అక్టోబరులో వివిధ పత్రికల్లో మినీ గోదాం పూర్తయ్యేదెప్పుడో? అని వార్తలు వచ్చినా, అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఏమాత్రం చలనం రాలేదు. అప్పట్లో ఎనిమిదేళ్లుగా పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తే.. నేటికి పదేళ్లు గడుస్తున్నా పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా తయారైంది.

### రూ.40 లక్షల ఉపాధి హామీ నిధులు

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగి, ధాన్యం ఆరబెట్టే ప్లాట్‌ఫారమ్ (మినీ గోదాం) నిర్మాణం కోసం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2014-15 కింద రూ.40 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు 2015లో అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లో పూర్తి చేయాల్సిన ఈ గోదాం నిర్మాణం కాంట్రాక్టర్ల మధ్య ఏర్పడిన భాగస్వామ్య వివాదాలు, ఆర్థిక లావాదేవీల వల్ల అర్ధాంతరంగా నిలిచిపోయింది. గోదాం నిర్మాణం పైకప్పు వరకు పూర్తి చేసి, ప్లాస్టరింగ్ చేసి వదిలేసి ఐదేళ్లకు పైగా అవుతోంది. ప్లాట్ ఫారం చుట్టూ పిచ్చిమొక్కలు మొలచి, శంకుస్థాపన శిలాఫలకం కూడా కనబడకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి, అకాల వర్షాలకు తడిసి ముద్దవుతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ గోదాం అందుబాటులోకి వస్తే ధాన్యాన్ని భద్రపరుచుకునే వెసులుబాటు ఉండేదని స్థానిక రైతాంగం వాపోతోంది. ప్రతి ఏటా వర్షాలకు ధాన్యం కొట్టుకుపోతోంది. రూ.40 లక్షల ప్రజాధనం వృథాగా మారినా ఏ ఒక్క అధికారి కూడా పనులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు పంచాయతీరాజ్ అధికారులు స్పందించి, నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

# కీసర పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

- స్వయం సహాయక సంఘాల మహిళలు, సహచరులు,సిఐ, ఎస్ ఐ లకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు,
- మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నా, సిఐ అర్కపల్లి ఆంజనేయులు

**ప్రజావాయిస్, కీసర:** రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని కీసర పోలీస్ స్టేషన్‌లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, సహచరులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసు అధికారులకు రాఖీలు కట్టారు. కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు బి. నాగరాజు, ఎస్. అనిల్ కుమార్, డి. జ్ఞానేందర్ రెడ్డి, కె. శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళలు పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మహిళలకు రాఖీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. పోలీసు సిబ్బంది—మహిళల మధ్య ఆత్మీయత, సోదరభావాన్ని పెంపొందించేలా కార్యక్రమం నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు.



మహిళలకు రాఖీ పర్వదిన శుభాకాంక్షలు

# జాహిరాబాద్ ఆసుపత్రి లో ఉన్నది 17 మంది

- అందులో నలుగురు డిప్యూటేషన్.... మిగతావాళ్లు....?
- రోడ్డు ప్రమాదం జరిగిన జాడలేని డాక్టర్లు
- ఆరోగ్యశాఖ మంత్రి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు
- నిన్న జోగిపేట నేడు జహీరాబాద్
- ప్రైవేట్ డాక్టర్ తో వైద్యం
- ఎనిమిది గంటల పాటు శవాలతో బంధువుల నిరీక్షణ



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** ఇది అసలే రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సొంత జిల్లా.... మంత్రి పేరు చెప్తే వైద్యులు వణికి పోవాలి.... కానీ దానికి భిన్నంగా మంత్రి ఉంటే మాకేంటి.... మా ఇష్టానుసారంగా మేము డ్యూటీలు చేస్తాం.. మమ్మల్ని అడిగేది ఎవరు అనే తరహాలో ప్రభుత్వ డాక్టర్లు ఇష్టరాజ్యంగా డ్యూటీలకు డుమ్మలు కొడుతూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గత వారం రోజుల క్రితమే జోగిపేట ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ డాక్టర్ కు బదులుగా ఓ ప్రైవేట్ డాక్టర్ తో చికిత్స చేయిస్తూ పట్టుబడిన వైన్యం మరువకముందే ఇదే జిల్లాలోని జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ప్రైవేట్ డాక్టర్ తో వైద్యం చేయిస్తూ స్థానికులకు చిక్కారు. ఏరియా ఆసుపత్రికి అనుకోని పరిస్థితుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ మృతి చెందారు. వీరి శవాలకు పోస్టుమార్టం నిర్వహించవలసింది జహీరాబాద్ ఆసుపత్రిలో... కానీ అక్కడ డాక్టర్లు ఎవరు లేకపోవడంతో ఉదయం 10 గంటల నుంచి మృతుల బంధువులు రోధిస్తూ ఆస్పత్రి ఎదుట కూర్చుండి పోయారు . వీరిని ఎవరు పలకరించిన పాపాన పోలేదు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోహిర్ మండలం పిచ్చేరాగడి – సజ్జాపూర్ గ్రామ శివారుల మధ్య ఒక డీసీఎం ఆటోను ఢీ కొట్టి ఆటో పై పడింది. దీంతో బడంపేట గ్రామానికి చెందిన రాఛాయ్య (40), అతని భార్య పద్మ అక్కడికక్కడే మృతి చెందారు. వీరిని పోస్ట్మార్టం నిమిత్తం కోహిర్ పోలీసులు జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉదయం 10:30 గంటలకు శవాలను తీసుకువచ్చిన ఆస్పత్రిలో ఏ ఒక్క డాక్టర్ కూడా లేకపోవడంతో సాయంత్రం ఐదున్నర గంటలైనా శవాలకు పోస్టుమార్టం జరపలేకపోయారు. ఇదిలా ఉంటే జైరాబాద్ వేరే ఆసుపత్రిలో 17 మంది డాక్టర్లు ఉండవలసి ఉండగా అందులో నలుగురు డిప్యూటేషన్ పై ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. మిగిలిన 13 మంది సెలవుల్లో వెళ్లారు. వీరికి సెలవులు అధికారులు అధికారికంగా ఇచ్చారా... అధికారికంగా ఇచ్చారా అనేది తెలియదు.. విచిత్రం ఏమిటంటే జిల్లా మెడికల్ అధికారి కూడా సెలవు పై ఉండడం గమనార్హం. సజ్జపూర్ రోడ్డు ప్రమాదం జరిగి రెండు గంటలైనా ఒక డాక్టర్ కూడా లేడని మీడియా ప్రతినిధి ఏరియా ఆసుపత్రి ఆర్ ఎం ఓ కు ఫోన్ చేస్తే అప్పటికప్పుడు అంటే 12 గంటల ప్రాంతంలో పక్కనే ఉన్నావ్ ప్రైవేట్ ఆస్పత్రికి సంబంధించిన డాక్టర్ సౌరబ్ ను ఆసుపత్రిలో రోగులకు చికిత్స చేయండి అంటూ సూచించారు. దీంతో అర్హత లేకపోయినా డాక్టర్ ఆగమేఘాలపై వచ్చి రోగులను పరీక్షించి వెళ్ళిపోయారు. కానీ 17 మంది డాక్టర్ ఉండవలసిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సుప్రజెంట్ తో పాటు కింది స్థాయి డాక్టర్ కూడా ఒక్కరు కూడా లేకపోవడం చూస్తే జిల్లాలో వైద్యం ఎలా అందుతుందో అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్య వహిస్తున్న సొంత జిల్లా. ఈ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనితీరు ఇలా ఉంది. మొన్న జోగిపేటలో ప్రైవేట్ డాక్టర్ రెగ్యులర్ డాక్టర్ వంతుకు విధులు నిర్వహిస్తూ చిక్కాడు... తాజాగా అదే పరిస్థితి జహిరాబాద్ లో కనిపించింది. దారుణమైన సంఘటన ఏమిటంటే జహీరాబాద్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగి భార్యాభర్తలు ఇద్దరు ఉదయం మృతి చెందారు. కనీసం పోస్టుమార్టం నిర్వహించేందుకు డాక్టర్లు లేకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు శవాల వద్ద రోదిస్తూ కూర్చుండిపోయారు తప్ప వారి రోదనను ఎవరు పట్టించుకోలేకపోయారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రత్యేక చొరువా తీసుకొని ప్రభుత్వ డాక్టర్ల పనితీరును సక్కదిద్దవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ ప్రణాళిక

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు**

**మహిళల భద్రత.. సైబర్ నేరాలపై అవగాహనకు ప్రాధాన్యం: ఎస్పీ నరసింహా**





**ప్రజా వాయిస్,కోదాడ:**
నేరాలు, రహదారి ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఎస్పీ నర్సింహ తెలిపారు. గురువారం కోదాడ డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలో పెరుగుతున్న జనసమ్మర్థం, వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు, ప్రజల్లో సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. రహదారిపై వాహనం బ్రేక్‌డౌన్ అయితే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని వాహనదారులు, ప్రయాణికులకు సూచించారు.ప్రజల భద్రత విషయంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్ చేపట్టాలని సూచించారు. డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి సూచించారు. సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.తనిఖీలో సీఐలు శివశంకర్‌నాయక్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐలు నవీన్, మోహన్, ఆర్ఎస్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి దాతృత్వం.. తండ్రి జ్ఞాపకార్థం స్థలదానం

**మొగలాయికోటలో ప్రభుత్వ భవనానికి 120 గజాల స్థలం ఇచ్చిన బుచ్చిరెడ్డి, భద్రారెడ్డి**

**ప్రజా వాయిస్,అనంతగిరి:**
గ్రామాభివృద్ధికి ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక స్వయం సహాయక సంఘం భవన నిర్మాణం నిలిచిపోయే పరిస్థితి నెలకొన్న వేళ మొగలాయికోట గ్రామానికి చెందిన సింగారెడ్డి చిన్న వెంకటరెడ్డి కుమారులు బుచ్చిరెడ్డి, భద్రారెడ్డిలు ముందుకొచ్చారు. తమ తండ్రి జ్ఞాపకార్థం సుమారు 120 గజాల సొంత స్థలాన్ని గ్రామాభివృద్ధి కోసం దానం చేశారు.మొగలాయికోట గ్రామానికి మంజూరైన స్వయం సహాయక సంఘం భవన నిర్మాణానికి స్థలం కొరత ఏర్పడిన విషయం తెలుసుకున్న బుచ్చిరెడ్డి, భద్రారెడ్డిలు తమ స్థలాన్ని అందించేందుకు అంగీకరించారు. ఈ మేరకు స్థలాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఉపసర్పంచ్ సమక్షంలో అధికారికంగా అప్పగించారు. దీంతో భవన నిర్మాణానికి ఉన్న ప్రధాన అడ్డంకి తొలగింది.తండ్రి జ్ఞాపకాలను గ్రామ అభివృద్ధితో ముడిపెట్టి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా స్థలాన్ని దానం చేయడం అభినందనీయమని గ్రామస్థులు కొనియాడారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాలకు, గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించిన సింగారెడ్డి చిన్న వెంకటరెడ్డి మనవళ్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రోహిత్‌రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సొంత స్థలాన్ని గ్రామం కోసం దానం చేయడం నిజమైన గ్రామాభివృద్ధికి నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు.

# హౌస్ అరెస్టులో దాస్యం వినయ్ భాస్కర్

**విద్యార్థుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.**

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలి.**



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళు_న్న దాస్యం వినయ్ భాస్కర్ ని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేయాలని చూస్తోందని.కాంగ్రెస్ నియంతృత్వ చర్యలు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం G.O. 97 ద్వారా విద్యార్థులపై అమలు చేస్తున్న కఠిన విధానాలను ప్రశ్నిస్తున్న నాయకులను అణచివేయాలని చూస్తోందని.శాంతియుతంగా విద్యార్థులకు అండగా నిలవాలనుకున్న మా నాయకుడు హరీష్ రావుని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలిఅక్రమ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులను తక్షణమే నిలిపివేయాలన్నారు.విద్యార్థుల ఆందోళనలను అణచివేసే ప్రయత్నాలను మానుకోవాలి.దేశంలో జెన్ జీ ఉద్యమం నడుస్తోందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి కాంగ్రెస్ ఈ రెండున్నర ఏళ్ల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోంది.పేదల భూములు 22ఏ పేరుతో లాక్కోవాలని.6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతోందని తెలిపారు.



# వృద్ధాశ్రమంలో అంజన్నగౌడ్ బర్త్‌డే వేడుకలు

**45 మంది వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు**

**ప్రజా వాయిస్,కోదాడ:**
సీనియర్ జర్నలిస్ట్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కారింగుల అంజన్నగౌడ్ జన్మదిన వేడుకలను కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు సేవా కార్యక్రమంతో నిర్వహించారు. గంధం రాము ఆధ్వర్యంలో ముకుందాపురంలోని ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో 45 మంది వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ.. అధ్యాపకుడిగా ప్రస్థానం ప్రారంభించిన అంజన్నగౌడ్ 35 ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తూ తనదైన గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. జర్నలిజంలోకి వస్తున్న యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గాంధీ, ఉపాధ్యక్షుడు సురేష్, కుడుముల సైదులు, గోపాల్, వాసు, సంపత్, శ్రీకాంత్, నజీర్, మహేష్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆర్చరీ పోటీలు...



**ప్రజా వాయిస్ దోమకొండ /**
ఆగస్టు 29న జరుపుకునే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దోమకొండ గడికోట ప్రాంగణంలో ఆర్చరీ పోటీలను నిర్వహించారు.ఈ ఆర్చరీ పోటీలను దోమకొండ గడికోట విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కోచ్ ప్రతాప్ దాస్ మాట్లాడుతూ ఈరోజు జరిగిన ఆర్చరీ క్రీడలో ఇండియన్ రౌండ్ సబ్ జూనియర్ (బాయ్స్) విభాగంలో మొదటి స్థానంలో సుహాస్( బాన్సువాడ ), రెండో స్థానంలో అవినాష్( బాన్సువాడ ) , మూడో స్థానంలో సందీప్( బాన్సువాడ ), బాలికల విభాగంలో మొదటి స్థానంలో అంజలి( బాన్సువాడ ), ద్వితీయ స్థానంలో శ్రావ్య ( బాన్సువాడ ), తృతీయ స్థానంలో దివ్య (బాన్స్వాడ), జూనియర్ బాయ్స్ భాగంలో మొదటి స్థానంలో అరవింద్ ( బాన్సువాడ ), ద్వితీయ స్థానంలో రేహాన్ (దోమకొండ), తృతీయ స్థానంలో రామ్ చరణ్(దోమకొండ ), బాలికలు విభాగంలో మొదటి స్థానంలో శ్రీజ(దోమకొండ), ద్వితీయ స్థానంలో లైలా( బాన్సువాడ ), తృతీయ స్థానంలో అశ్విని ( బాన్సువాడ ) నిలిచారని అన్నారు. రికర్వ్ బాయ్స్ విభాగంలో మొదటి స్థానంలో అనుదీప్ (దోమకొండ), ద్వితీయ స్థానంలో నవీన్ (దోమకొండ), తృతీయ స్థానంలో నితీష్ (దోమకొండ), బాలికలు విభాగం లో మొదటి స్థానంలో ఇందు (దోమకొండ), ద్వితీయ స్థానంలో వర్షిని (దోమకొండ), తృతీయ స్థానంలో నక్షత్ర (దోమకొండ) నిలిచినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్చరీ అధ్యక్షుడు తిరుమల్ గౌడ్ , మోహన్ రెడ్డి కార్యదర్శి, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జి, గణేష్ ఆర్చరీ కోచ్‌లు ప్రతాప్ దాస్ పీర్యా నాయక్ పాల్గొని పోటీల నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించారు. తిరుమల గౌడ్ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ మరియు ప్రతిభను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ ఆర్చరీ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**జప్తి వీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందడి**



**ప్రజా వాయిస్, మిర్యాలగూడ.**
మిర్యాలగూడ మండలం జప్తి వీరప్పగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ విశిష్టత, ప్రాధాన్యతలను వివరించారు. రక్షాబంధన్ అనేది కేవలం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధానికి మాత్రమే సంబంధించిన పండుగ కాదని అన్నారు. కష్టసుఖాల్లో, బాధల్లో, ఆనందాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ, సహాయ సహకారాలు అందించుకుంటూ పరస్పర రక్షణకు కట్టుబడి ఉండాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని తెలిపారు.వ్యక్తి రక్షణ కుటుంబ రక్షణగా, కుటుంబ రక్షణ గ్రామ రక్షణగా, గ్రామ రక్షణ దేశ రక్షణగా మారాలనే దృఢ సంకల్పమే రక్షాబంధన్ స్ఫూర్తి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, ఎడవల్లి దామోదర్ రెడ్డి, ఒట్టే మాధవి, తుమ్మలూరి శ్రీనివాస్ రెడ్డి, ధీరావత్ జలరం, నారాయణ చంద్రకళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి





**కస్తూరిబా బాలికల పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు.**

**ప్రజా వాయిస్ ములుగు ఏటూరునాగారం మండలం:/**
మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సోదరభావం, ఆత్మీయతను పెంపొందించుకోవాలి.**

ఈ సందర్భంగా విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ పండుగ విశిష్టతను చాటారు. సోదరభావం, ప్రేమ, ఆత్మీయత, అనుబంధాల ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు.

**“చదువుపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలి.”**

అనంతరం 9, 10వ తరగతి విద్యార్థినులకు చదువుకు ఉపయోగపడే టేబుళ్లను అందజేశారు. విద్యార్థినులు చదువుపై మరింత దృష్టి సారించి ఉన్నత ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.






# విలోచవరం ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకం ప్రారంభం

**- హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సౌజన్యంతో విద్యార్థులకు పౌష్టికాహార పంపిణీ చేపట్టిన సర్పంచ్ కొండ ప్రేమలత రవీందర్**

**ప్రజా వాయిస్ మంథని**
పెద్దపల్లి జిల్లా మంథని మండలం ?విలోచవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన అల్పాహార పథకాన్ని గ్రామ సర్పంచ్ కొండ ప్రేమలత రవీందర్ ఘనంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం మరియు శారీరక ఎదుగుదలకు ఉదయం వేళ పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఉదయాన్నే పోషకాలతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల పిల్లలలో ఏకాగ్రత పెరిగి చదువులో బాగా రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ నిర్వాహకుల సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన అల్పాహారం అందించేందుకు కృషి చేస్తున్న అందరికీ ఈ సందర్భంగా గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు.



# అనంతగిరిపల్లిలో ఎస్ఐఆర్ కార్యక్రమం

**- పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి వార్డు నం.10లో గురువారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా జాబితాలో పేరు లేని వారు బి ఎల్ ఓ, ఏ ఈ ఆర్ వో, వీఆర్వో లను సంప్రదించాలని అధికారులు సూచించారు.సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదు, ఫారం-7 ద్వారా మృతులు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు, ఫారం-8 ద్వారా వివరాల సవరణ చేసుకోవచ్చని తెలిపారు. తుది జాబితా అక్టోబర్ 19న విడుదల కానుంది.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అర్ద సుధాకర్ రెడ్డితో పాటు డిఆర్ఓ స్వర్ణలత, కమిషనర్ జై సింహా రెడ్డి, డిప్యూటీ ఎమ్మార్వో శ్రీనివాస్ గౌడ్, జీపిఓ సుధ, వార్డు ఆఫీసర్ శ్రీకాంత్, బి ఎల్ ఓ లు యాదమ్మ, సునంద, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కీసర ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డికి రాఖీ కట్టిన ఆర్పీలు

**ప్రజాసేవలో పోలీసుల పాత్రకు అభినందనగా రాఖీ పౌర్ణమి వేడుకలు**

**మేడ్చల్, కీసర / ప్రజా వాయిస్ :**
రాఖీ పౌర్ణమి సందర్భంగా కీసర పోలీస్ స్టేషన్ ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డికి స్థానిక ఆర్పీలు (రిసోర్స్ పర్సన్లు) ముందుగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐకి తిలకం దిద్ది, హారతి ఇచ్చి రాఖీ కట్టారు.ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహించే పోలీసు అధికారులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆర్పీలు పేర్కొన్నారు. మహిళల ప్రేమాభిమానాలు తనపై మరింత బాధ్యతను పెంచుతున్నాయని, మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్పీలు రామిడి రూప, ఎల్.పీ. వసంత, టి. స్రవంతి, బి. లావణ్య, ఎం. సుమలత తదితరులు పాల్గొన్నారు.




# శాంతిభద్రతల రక్షకుడికే 'రక్షా' బంధం

**సమాజంలో రక్షణ ఇవ్వాలని విద్యార్థినుల వేడుకోలు!**

**సిఐ కి రాఖీ కట్టి తమ భద్రతకు భరోసా కోరిన ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ**

**ప్రజావాయిస్/చౌటుప్పల్**
మహిళలు, బాలికలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తూ, వారు స్వేచ్ఛగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగేలా సమాజం, ప్రభుత్వాలు తోడ్పడాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల గర్ల్స్ కన్వీనర్ పల్సం సృజన డిమాండ్ చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ, నలంద డిగ్రీ కళాశాల విద్యార్థినులతో కలిసి చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.సమాజానికి రక్షణగా నిలిచే పోలీస్ శాఖ అధికారులే ఒక సొంత అన్నలా తమకు అండగా నిలిచి, భద్రతకు పూర్తి భరోసా కల్పించాలని విద్యార్థినులు కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నేరస్థుల్లో భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరగకుండా నిఘా పెట్టి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు దాసరి ప్రకాష్, తిగుళ్ళ శ్రీనివాస్, సుర్వి అరవింద్, పోలేపల్లి మల్లేష్, విద్యార్థిలు చంద్రిక, శ్రీవల్లి, పావని, శిరీష, దీప తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం బహిరంగ సభను జయప్రదం చేయండి

**శామీర్‌పేట చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి**

**సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**దాసరి పాండు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**

**ప్రజా వాయిస్ /బొమ్మలరామారం:**
యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో చేపట్టనున్న పాదయాత్రను, 31న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు పిలుపునిచ్చారు. పాదయాత్ర, బహిరంగ సభకు ప్రజల మద్దతు కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రాజెక్టుల పూర్తికి తగిన బడ్జెట్ కేటాయించకపోవడంతో ఆ హామీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. సాగు, తాగునీరు అందుబాటులో లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి కోసం ప్రజలు పట్టణాలకు వలస వెళ్తున్నారని అన్నారు. శామీర్‌పేట చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే బొమ్మలరామారం మండలానికి సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సాగు, తాగునీటికి ఉపయోగపడే పెండింగ్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, కాలువలను పూర్తి



చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్ర, 31న హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు పున్నమ్మ, మంగ, పద్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది

**ఎమ్మెల్యే నాయిని...**

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలనే తనకు కూడా ఉందని, సమస్యలపై పోరాడకుండా, తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఇప్పటికే చర్చించిన తర్వాతే తాను ధర్నా కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులు--పెన్షనర్ల సమస్యల పరిష్కారం



వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు.హెల్త్ కార్డులు, రిటైర్మెంట్‌కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ఉద్యోగులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ముఖ్యమంత్రిని కలసి సమస్యపై చర్చించేందుకు తాను కూడా వారితో కలిసి వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, వ్యవస్థాత్మకంగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఉద్యోగులు వివిధ పార్టీలకు అభిమానులుగా ఉండవచ్చని, అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.తాను ధర్నాకు వచ్చే ముందు కూడా ప్రభుత్వ పెద్దలతో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించానని, ఏ విధంగా ముందుకు వెళ్లాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించిన తర్వాతే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో ఈ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎచీ+టాం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫరీద్ పేట్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మాజీ సర్పంచ్ హయంలో జరిగిన అక్రమాలు**

**అక్రమ కట్టడము పై డిఎల్పిఓ విచారణ**

**పాల్వంచ కామారెడ్డి జిల్లా ప్రజా వాయిస్/**
కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్ పేట్ గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ జీడిపల్లి నరసింహ రెడ్డి అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గత మాజీ సర్పంచ్ హాయంలో జరిగిన అక్రమాలు నిధుల దుర్వినియోగంలో, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఫరీద్ పేట్ లో పర్మిషన్ లేకుండా గృహ నిర్మాణం చేపట్టడం తో గత ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు తో గురువారం రోజున కామారెడ్డి డిఐఎల్పిఓ శ్రీనివాస్, ఎంపీఓ సురేందర్ రెడ్డి లు విచారణ, పరిశీలన చేశారు. మాజీ సర్పంచ్ హయాంలో 13 లక్షల అవినీతి నిధుల దుర్వినియోగం చేయడం ద్వారా విచారణ, ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి, నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తామని డి ఎల్ పి ఓ శ్రీనివాస్ తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం నుండి కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎటువంటి పర్మిషన్ లేకుండా గ్రామపంచాయతీ లో పర్మిషన్ జీవో లేక ఇంటి నిర్మాణం చేపట్టారని దానిమీద ఇచ్చిన గ్రామ సర్పంచి జీడిపల్లి నరసింహారెడ్డి,వార్డు సభ్యురాలు దేవోల్లా ప్రత్యూష,ఫిర్యాదు చేశారు. ఎంపీఓ సురేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రెటరీ వివరణ అడగగా గ్రామపంచాయతీలో ఎటువంటి పర్మిషన్ లేదని దానికి సంబంధించిన ఎటువంటి గ్రామపంచాయతీలో ఇప్పటివరకు పర్మిషన్ లేని అక్రమ గృహ నిర్మాణం చేపట్టారని పంచాయతీ సెక్రెటరీ తెలిపారు. తక్షణమే అధికారులు చర్య తీసుకొని గృహ పరిమిషన్ గ్రామపంచాయతీ నుండి తీసుకోవాలని గత మూడు సంవత్సరాల నుండి ఇంటి పన్నును తక్షణమే గ్రామపంచాయతీలో కట్టించాలని సర్పంచ్ జీడిపల్లి



నరసింహారెడ్డి, దేవోల్లా రాములు వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు యువత డిమాండ్ చేశారు

# మున్నేరులో అక్రమ ఇసుక దందాపై ఖాకీల పంజా!

**పెదమండవ, గంధసిరి కేంద్రంగా అక్రమ రవాణా?**

**17 ట్రాక్టర్లు స్వాధీనం.. 24 మందిపై కేసులు: ముదిగొండ ఎస్సై హరిత**

**ప్రజా వాయిస్ ఖమ్మం:**
మున్నేరు వాగు నుంచి యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ముదిగొండ పోలీసులు పంజా విసిరారు. మండల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్నేరు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో సీఐ మురళి ఆదేశాల మేరకు ఎస్సై హరిత తన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో వి.వి. కిష్టాపురం సమీపంలో ఇసుక తరలిస్తున్న 12 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఉదయం 7 గంటలకు లక్ష్మీపురం వద్ద మరో 5 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.సీజ్ చేసిన మొత్తం 17 ట్రాక్టర్లు పెదమండవ, గంధసిరి గ్రామాలకు చెందినవిగా గుర్తించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు సహా మొత్తం 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హరిత వెల్లడించారు. మున్నేరు నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై హరితతో పాటు పోలీస్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్, శ్రీను, వెంకట్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



# మహాసభల విజయవంతానికి కదం తొక్కిన యువత

## భీమదేవరపల్లి మండలంలో నాలుగు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక

**ప్రజా వాయిస్ భీమదేవరపల్లి**

వచ్చే సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న మండల కమిటీల జాతీయ మహాసభను ఘనంగా విజయవంతం చేయడమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు భీమదేవరపల్లి మండలంలో యువత సమరోత్సాహంతో ముందుకు సాగుతోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన యువ ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) గ్రామ కమిటీలను ఉత్సాహపూరిత వాతావరణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇందులో భాగంగా రాంనగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కనకం రమేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కనక రాజు ఎన్నికయ్యారు.



ముస్తాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కనక వినయ్, ఉపాధ్యక్షుడిగా మిడిదొడ్డి సృజన్, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల కరుణాకర్ బాధ్యతలు చేపట్టారు. చంటయ్యపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లింగాల అఖిల్, ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా లింగాల అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే రత్నగిరి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పార్నందుల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా చిట్టెంపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పారునందుల ఆనంద్ ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ, భీమదేవరపల్లి ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జి వేల్పుల ప్రశాంత్ హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే జాతీయ మహాసభను విజయవంతం చేయడానికి యువత ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్నందుల సురేష్, తాళ్లపల్లి ఆశీర్వాదం, మాడుగుల ప్రభుదాస్, శిఖ సురేష్, నాగిళ్ల చందర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాచారెడ్డి సింగిల్ విండో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

### పాల్గొన్న అడ్వైజర్ షబ్బీర్ అలీ

**ప్రజావాయిస్ మాచారెడ్డి, ఆగస్టు 27 :**

మాచారెడ్డి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం చేపట్టింది. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పీఏసీఎస్ చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ పాలకవర్గ సభ్యులు ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి



కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు.పీఏసీఎస్‌లు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే కేంద్రాలుగా పనిచేయాలని షబ్బీర్ అలీ అన్నారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నూతన చైర్మన్ నౌసిలాల్ నాయక్ రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలు అందించాలని సూచించారు.మాచారెడ్డి మండల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు తగ్గించడం సిగ్గుచేటు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజా వాయిస్:**

రాజేంద్రనగర్:మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాల్సింది పోయి,ఉన్న వేతనాలను తగ్గించడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ..జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన నేపథ్యంలో మల్కాజ్‌గిరి,సైబరాబాద్ కార్పొరేషన్లలో మున్సిపల్ కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమన్నారు.2వ పీఆర్సీని అమలు చేయడంతోపాటు జీహెచ్ఎంసీలో చెల్లిస్తున్న వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వెంటనే రెగ్యులరైజ్ చేయడంతోపాటు నెలకు కనీస వేతనం రూ.26




వేలు చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే కార్మిక సంఘాలను ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ..మున్సిపల్ కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు,ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు,వృద్ధాప్య, వితంతు పింఛన్లు వంటి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు,డ్రైవర్లు, వాటర్ సప్లై,శానిటరీ జవాన్లు,ఇన్‌స్పెక్టర్లు, ఎన్ఎంఆర్ కార్మికులకు తగ్గించిన వేతనాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. విధి నిర్వహణలో లేదా అనారోగ్యంతో మృతి చెందిన,60 ఏళ్లు పైబడిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి మానవతా దృక్పథంతో ఉద్యోగం కల్పించాలని యూనియన్ అధ్యక్షుడు కె.ఏసురత్నం డిమాండ్ చేశారు.ధర్నాలో ఏఐటీయూసీ,మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జైలు భద్రతపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక దృష్టి

- జైలును సందర్శించి భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేశ-నిష్క్రమణ ప్రాంతాల క్షేత్రస్థాయి తనిఖీ
- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచన
- పోలీసు, జైలు శాఖల మధ్య సమన్వయంతో భద్రత మరింత బలోపేతం చేయాలని ఆదేశం
- సిబ్బంది క్రమశిక్షణ, అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం




**నల్లగొండ,ప్రజా వాయిస్.**

నల్లగొండ జిల్లా జైలులో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. గురువారం జిల్లా జైలును సందర్శించిన ఆయన, జైలు సూపరింటెండెంట్‌తో కలిసి భద్రతా వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జైలు పరిసరాలు, సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేశ-నిష్క్రమణ ప్రాంతాలు, అమలులో ఉన్న భద్రతా విధానాలను ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జైలు సూపరింటెండెంట్‌కు పలు సూచనలు, సలహాలు అందజేశారు.జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. సెక్యూరిటీ పాయింట్ల వద్ద సిబ్బంది మరింత అప్రమత్తతతో విధులు నిర్వహించేలా చూడాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణను సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. జైలులో భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, లోటుపాట్లు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దాలని తెలిపారు.జైలు భద్రత విషయంలో పోలీసు శాఖ, జైలు శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకుంటూ సమిష్టిగా చర్యలు చేపడితే జైలు భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.జైలు సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, అప్రమత్తతతో పాటు నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భద్రతా పరిస్థితులను తరచూ సమీక్షిస్తూ, అవసరానికి అనుగుణంగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంలో జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సామగ్రి పంపిణీ

### విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమానికి ప్రాధాన్యత

### కలెక్టర్ కే. హరిత

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కే. హరిత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు, బెడ్‌షీట్లు, కార్పెట్లు, షూస్, ప్లేట్లు, గ్లాసులు, కిట్ బ్యాగులు తదితర విద్యా, వసతి సామగ్రిని పంపిణీ చేశారు.అనంతరం పాఠశాల ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు.కలెక్టర్ విద్యార్థులు, వసతి గృహ బోర్డర్లతో నేరుగా ముచ్చటించి వారి చదువు, ప్రతిభ, ఆరోగ్యం, భోజనం, పరిశుభ్రత, వసతి సౌకర్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధిపై ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ జాదవ్ అంబాజీ, డీఆర్డీఏ పీడీ బానోత్ దత్తారం, ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్, ఏటీడీఓ చిరంజీవి, డీఎస్ఓ మాడావి శేఖు, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డెన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# దోమకొండ వాసులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

### సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు....

**ప్రజావాయిస్, దోమకొండ ఆగస్టు 27/**

దోమకొండ గ్రామపంచాయతీ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. సర్పంచ్ ఐరేని నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యంతో పాటు అవసరమైన రేషన్ సరుకులను అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కొత్తగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో సుమారు తొమ్మిది ప్రత్యేక భద్రతా ఫీచర్లు ఉన్నాయని, కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్డులు వాటర్‌ప్రూఫ్‌గా రూపొందించారని వివరించారు.కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, అబ్బబోయిన రాజేందర్, షమ్మీ, జీపీఓ అశోక్, వార్డు సభ్యులు, రేషన్ షాప్ డీలర్లు, స్థానికులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# మోత్కూర్ లో వినూత్న రీతిలో రక్షా(వృక్షా)బంధన్

**ప్రజావాయిస్, మోత్కూరు(ఆగష్టు27):**

రక్షా(వృక్షా)బంధన్ ను వినూత్న రీతిలో జరుపుకున్న సంఘటన మోత్కూర్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ప్రకృతిని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని మోత్కూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అన్నారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని మోత్కూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు "వృక్షాబంధన్" కార్యక్రమాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లకు రాఖీలు కట్టి వినూత్నంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ చెట్లు మనకు ప్రాణవాయువు తోపాటు జీవవైవిద్యాన్ని కల్పించి మానవ మనుగడకు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు బాల్యం నుండే ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు




# రైతులు రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించాలి

**ప్రకృతి సహజ సిద్ధంగా లభించే పశువుల పేడ, చెట్ల పదార్థాలు వాడాలి**

**పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు రైతులు సహకరించాలి**

**గడ్డిపల్లి సీనియర్ రిటైర్డ్ శాస్త్రవేత్త నర్సింహారెడ్డి**

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
రైతులు రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించి ప్రకృతి సహజసిద్ధంగా లభించే పశువుల పేడ, చెట్ల పదార్థాలు వాడి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని (కెవికె) గడ్డిపల్లి సీనియర్ (రిటైర్డ్) శాస్త్రవేత్త ఎస్. నర్సింహ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏటీఎంఏ) లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగులో మెలుకువలు, పశు పోషణ, గొర్ల పెంపకం, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు వంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. పంటల సాగులో సరైన విత్తనాలు ఎంపిక చేసుకొని సమతుల్య ఎరువులు మరియు పురుగుల మందులు వాడాలని అన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా ఎరువులు ఉపయోగించాలని కోరారు. రైతులు నేల సారాన్ని మరియు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఏడిఏ నిర్మల, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి పాండురంగాచారి, ఆత్మ మెంబర్ బి.స్వప్న వార్డు సభ్యులు సందీప్ రెడ్డి, సమీర్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఏ.అనూ,ష ఎస్.అక్షర రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# బాలికల పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**విద్యార్థుల్లో సోదరభావాన్ని పెంపొందించాలన్నదే లక్ష్యం: ఎస్.ఎఫ్.ఐ**

ప్రజావాయిస్ / సంస్థాన్ నారాయణపురం
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు రక్షణ కల్పిస్తున్న పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ సభ్యులు సూర్పి అరవింద్ గౌడ్ మాట్లాడుతూ రాఖీ పండుగ కేవలం ఒక సంప్రదాయానికే పరిమితం కాకుండా, సమాజంలో సోదర–సోదరీమణుల మధ్య గౌరవం, బాధ్యత మరియు భద్రతను గుర్తుచేసే ఒక గొప్ప సందర్భమని అన్నారు. ప్రతి పాఠశాలలోనూ బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పాఠశాల ఇంచార్జ్ అనిత విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ సృజన, గోపాల్, సాయి కుమార్, ఎస్ ఎఫ్ ఐ మండల కమిటీ సభ్యులు వంశీ, స్వామి, సతీష్, పవన్, శివ మరియు పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సందడి

**గిరిజన సంప్రదాయ నృత్యంతో అలరించిన ఎమ్మెల్యే**



ప్రజా వాయిస్, కోదాడ:
కోదాడ మండల పరిధిలోని మంగలి తండా గ్రామంలో తీజ్ ఉత్సవాల్లో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పాల్గొని సందడి చేశారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలను నిర్వహించిన బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తండా ప్రజలతో కలిసి గిరిజన సంప్రదాయ నృత్యంలో పాల్గొని ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే తమతో కలిసి నృత్యం చేయడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తండా ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ ధరావత్ బాబ్జి నాయక్, ఉపసర్పంచ్ ధరావత్ కృష్ణవేణి హనుమంతు, వార్డు సభ్యులు బానోత్ శారద వెంకటేశ్వర్లు, ధరావత్ జయజండా, ధరావత్ రాజు, మాలోత్ వెంకటేశ్వర్లు, ధరావత్ సాలమ్మ లచ్చు, ధరావత్ కమలా కీమా, ధరావత్ నెహ్రూ, గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలి

**రంగాపూరశీ, రామస్వామి తండాలో SIR గ్రామ సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**ప్రజా వాయిస్ / బొమ్మలరామారం :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్, రామస్వామి తండా గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నిర్వహించిన గ్రామ సభల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేని వారు సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు తెలిపారు. గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రాాజూ చైర్మన్ సింగిర్తి మల్లేశశీ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర సత్యనారాయణ, ఆత్మకమిటీ చైర్మన్ సుధాకర్ , రంగపూరం సర్పంచ్ సరస్వతి గణేష్, రామస్వామి తండా సర్పంచ్ సునీత వెంకటేష్,భగవత్ రెడ్డి, సూర్య ప్రకాష్ రెడ్డి, సుంచు యాదగిరి , రాజు నాయక్, నాగరాజు,శ్రీరామ్ నాయక్, హేమంత్ రెడ్డి,వెంకటేష్,నరేందర్ రెడ్డి,మహేష్, బాబు, శ్రీకాంత్, నందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవాగు ప్రాజెక్ట్ కు సీతారామ కాలువ నీళ్లు

**ఫోటోలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రచారం**

**జనసేన మండల అధ్యక్షుడు రమేష్**



**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**
సీతారామ ప్రాజెక్ట్, రాజీవ్ కెనాల్ ద్వారా విడుదల చేసిన నీళ్లు కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్ట్ చెరువులో కనీసం నాలుగు అడుగుల కూడా చేరలేదని, ఫోటోలతో ప్రజలను కాంగ్రెస్ నాయకులు మభ్యపెడుతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ విమర్శించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ నీటిని దారి మళ్లించి పక్క జిల్లాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. నీటిని మా భూముల గుండా తీసుకు వెళుతూ మాకు నీళు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, మండల రైతులు, రైతు సంఘాల నాయకులు నెత్తినోరు కొట్టుకున్న పట్టించుకునే నాధుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రవాగు కు నీళ్లు అందిస్తున్నామని చేస్తున్న ప్రచారం కేవలం ఫోటోలు, ఆర్భాటానికే పరిమితమైందని రమేష్ విమర్శించారు. దీర్ఘకాలిక ప్రయోజనం కోసం కాలువలు, స్వెటర్లు, లాక్ ల ద్వారా చెరువులకు నిరంధించకుండా, సిమెంటు పైపు, ప్లాస్టిక్ సెక్షన్ పైప్ ద్వారా చెరువులకు నీళ్లు అందించడం ఏంటని ప్రశ్నించారు. సుమారు 250 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఎర్రవాగు చెరువులో ఇప్పటికీ కనీసం నాలుగు అడుగుల నీరు కూడా చేరకపోవడం కాంగ్రెస్ నాయకుల అసమర్థతకు నిదర్శనం అన్నారు. కాకర్ల ఎర్రవాగు చెరువు కు రెండు తూములు, ఎనిమిది పిల్లకాలువల ద్వారా సుమారు 1200 వందల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉందని అన్నారు. ఇప్పటికీ చెరువుకు పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు రైతుల మీద నిజంగా ప్రేమ ఉంటే తూతూ మంత్రం పనులను పక్కన పెట్టి, శాశ్వత కాలువల ద్వారా మండలంలోని చెరువులను నింపి మండలాన్ని సస్యశ్యామలం చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. లేకపోతే మండల ప్రజలు కాంగ్రెస్ నాయకులకు “బిల్డప్ ఎక్కువ బిజినెస్ తక్కువ” అనుకునే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రమేష్ జోష్యం చెప్పారు.

# ఓటరు సవరణ జాబితాలో తప్పులు లేకుండా సహకరించాలి

**బీఎల్ఓలకు అవసరమైన డాక్యుమెంట్లు అందించాలి**

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



ప్రజావాయిస్, కీసర :
ఓటరు సవరణ జాబితాకు ప్రతి ఒక ఓటరు బిఎల్ఓలతో సహాకరించి అవసరమైన మేర డాక్యుమెంట్లు ఇవ్వాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. గురువారం కీసర మండలంలోని చీర్యాల గ్రామంలో సర్ పై నిర్వహించిన గ్రామ సభకు అదనపు కలెక్టర్ హాజరై, మట్లాడతూ గ్రామసభను పూర్తి పారదర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటరు సవరణ పై ఏలాంటి సందేహాలు ఉన్న గ్రామ సభలలో నివృత్తి చేసుకోవాలన్నారు. 2002 లో ఓటరు జాబితాలో ఉన్న వివరాలు, ప్రస్తుతం ఉన్న జాబితాలో వివరాలు సరిచూడడం జరిగింది. మీరు ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలలో 2002 నాటి వివరాలు లేకపోయినట్లయిన, చిన్న చిన్న సవరణలు, ఉన్నట్లుతే వారి డాక్యుమెంట్స్ వెరిఫై చేసుకొని సవరణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్స్ దీూా లు వచ్చి నోటీస్ ఇస్తారు, ఓటరుకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఇవ్వగలిగితే మీ పేరు ఫైనల్ జాబితాలో ఉంటుందని, ప్రతి ఒక ఓటరు బిఎల్ ఓలతో సహాకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఓటరు సవరణ జాబితాకు సంబంధించి 11 డాక్యుమెంట్స్ ఏవైతే ఉన్నాయో, మీ దగ్గర ఏది అందుబాటులో ఉందని చూసుకొని ఆ డాక్యుమెంట్స్ బిఎల్ఓకు ఇస్తే తప్పకుండా ఫైనల్ పబ్లికేషన్ చేసేటప్పుడు మీ పేరు, మీ కుటుంబ సభ్యులు వారందరి పేర్లు కూడా వస్తాయన్నారు. బిఎల్ఓలు తమ తమ బూతులలోని ఓటరు లిస్టులలో మరణించిన, డబుల్ ఎనరోల్ అయిన వారి పేర్లను చదివి వినిపించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫార్మ్ 6, చనిపోయిన వాళ్లకు సంబంధించినది ఫార్మ్ 7, మీకు ఎటువంటి సవరణలు చేయాలన్నా అంటే పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ వంటి ఎలాంటి సవరణలు ఉన్న ఫార్మ్ 8 లో చేసుకోవాలన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, కీసర తహాసీల్దారు యాదగిరి రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధరాజకీయ పార్టీల నాయకులు , ప్రజలు, పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యం మెరుగుపడాలి



**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి**

ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:
ప్రతి విద్యార్థి చదువులో ముందంజలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. గురువారం శంషాబాద్ మండలం సాతంరాయి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుమారు మూడు గంటల పాటు తరగతి గదుల్లో బోధనా తీరును పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఎఫ్ఎల్ఎన్ (తొలిమెట్టు), రిమిడియేషన్ కార్యక్రమాల అమలు తీరును తెలుసుకున్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి బోధన అందించాలని, చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కిరణ్మయి ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు రాసేటప్పుడు చేసే తప్పులను సరిదిద్దుతూ విషయాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని,తెలుగు భాషపై పట్టు తక్కువగా ఉన్న పిల్లలకు అవసరమైన చోట మాతృభాషలో సూచనలు ఇవ్వాలని తెలిపారు. ప్రతి విద్యార్థి 100 శాతం నేర్చుకునే సామర్థ్యాన్ని సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులను పరిశీలించి,విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కిరణ్మయి స్పష్టం చేశారు. తనిఖీలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య,లక్ష్మారెడ్డి, ఆర్పీ రవికుమార్,మండల ఆపరేటర్ మజర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

# కామారెడ్డి లో బి ఆర్ ఎస్ ధర్నా

**ఏడాదైనా కల్వర్టులు నిర్మించలేదు**

**జాడ లేని వరద సహాయ పనులు**

**సీఎం షబ్బీర్ రమణారెడ్డి ఫెయిల్**



ప్రజావాయిస్ కామారెడ్డి/
వరద సహాయ పనులు చేపట్టడం లేదని కామారెడ్డి జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జి ఆర్ కాలనిలో ధర్నా నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ వరద బీభత్సం గత ఏడాది ఆగస్టు 27 భారీ వర్షాలు 40 సెంటీమీటర్ల కురిసిందని కూలిన కల్వర్టులు ఏడాదైనా నిర్మించలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, అడ్వైజర్ షబ్బీర్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి కూల్చిన కల్వర్టులు నిర్మించలేదన్నారు. భారీ వర్షాలకు ముగ్గురు చనిపోయి, కోట్ల రూపాయల రోడ్లు కల్వర్టు రహదారు లు ధ్వంసం అయ్యాయన్నారు. వరద సహాయ పనులు చేయడంలో, ధ్వంసం అయిన రోడ్లు కల్వర్టులు నిర్మించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి మాజీ ఎమ్మెల్యే గోవర్ధన్ ఆరోపించారు. కామారెడ్డి సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని ధర్నాలు ఆందోళన చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.



# డీసీసీ అధ్యక్షుడు ఇనగాలకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
రక్షాబంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి బ్రహ్మకుమారీస్ సోదరీమణులు రాఖీ కట్టారు. హనుమకొండ రామకృష్ణ కాలనీ లోని ఆయన నివాసానికి విచ్చేసిన బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ పర్వదిన శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పరమాత్మ శివబాబా ఈశ్వరీయ ఆశీస్సులు, ప్రసాదాన్ని అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని, ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.

# దేశం, ధర్మ రక్షణ కోసం ఐక్యమత్యమే శరణ్యం

## దౌల్తాబాద్‌లో ఘనంగా ఆర్ఎస్ఎస్ రక్షాబంధన్ వేడుకలు



**ప్రజా వాయిస్ దౌల్తాబాద్**
దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ సోదరభావం, ఐక్యత మరియు సామాజిక సమరసతను చాటారు.దేశం, ధర్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ సమైక్యంగా ముందుకు సాగాలని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పిలుపునిచ్చారు. "నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష.. మనమందరం కలిసి ఈ దేశానికి, ధర్మానికి రక్ష" అనే సందేశాన్ని విద్యార్థులలో నూరిపోశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పర సహకారం మరియు ఐక్యతతో జీవించాల్సిన అవసరాన్ని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు విరివిగా పాల్గొన్నారు.

# చీకటి గూడేలకు సోలార్ వెలుగులు

## 50 గిరిజన కుటుంబాలకు ఇడుపుల రాజు చేయూత

## రెండు లక్షల విలువైన సోలార్ లైట్లు, బ్యాటరీల పంపిణీ





**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**
విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో మగ్గుతున్న గిరిజన కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జూలూరుపాడు కు చెందిన ఇడుపుల రాజు ముందుకు వచ్చారు. ములకలపల్లి మండలంలోని పాత గుండాలపాడు పంచాయతీ పరిధిలోని పాలవాగు, ఓర్రెగుంపు తదితర గిరిజన గూడేల్లో నివసిస్తున్న సుమారు 50 గుత్తికోయ కుటుంబాలకు రూ.2 లక్షల విలువైన సోలార్ లైట్లు, బ్యాటరీలు, ఇతర సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. అడవుల్లో విషపురుగులు, కీటకాలు, క్రూరమృగాల సంచారం మధ్య జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు రాత్రివేళల్లో వెలుతురు ఎంతో అవసరమని గుర్తించి ఈ సహాయం అందించినట్లు ఇడుపుల రాజు తెలిపారు. సమాజానికి దూరంగా, సహజ వనరులపై ఆధారపడి జీవిస్తున్న గుత్తికోయ కుటుంబాలకు అండగా నిలవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. "చీకట్లో ఉన్న వారి జీవితాల్లో చిన్న వెలుగైనా నింపడం మన మానవతా బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గిరిజన కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. మానవతా దృక్పథంతో సహాయం చేసేందుకు ముందుకు వచ్చే వారు తనను సంప్రదిస్తే, మరింత మెరుగైన సహాయాన్ని అందించేందుకు కలిసి పనిచేస్తానని తెలిపారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## మేనకోడలు వివాహ వేడుకలో రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ



**(ప్రజా వాయిస్ షాద్‌నగర్)**
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేనకోడలు వివాహ వేడుక శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రవణ్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను ఆత్మీయంగా పలకరించి సాదరంగా అభివాదం చేశారు వివాహ వేడుక సందర్భంగా ఇరువురి మధ్య ఆత్మీయ పలకరింపు చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి: 9 మంది అరెస్ట్!

### కంకణాలగూడెం పరిధిలో పేకాట రాయుళ్ల గుట్టురట్టు..8 బైకులు, నగదు స్వాధీనం

### అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్సై సీతా పాండు హెచ్చరికల



**ప్రజావాయిస్ / సంస్థాన్ నారాయణపురం**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం పోలీసులు మెరుపు దాడి జరిపారు.ఎస్సై సీతా పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంకణాలగూడెం రెవెన్యూ పరిధిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన ఎస్సై పాండు తన సిబ్బందితో కలిసి ఆ స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.11,400 నగదు, 8 బైకులు, మరియు 4 సెట్ల పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సీతా పాండు మాట్లాడుతూ.. మండలంలో పేకాట, డ్రగ్స్, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

# జీవదాన్ హాస్పిటల్ లో వైద్యుల నిర్లక్ష్యంతో మహిళా మృతి

### హాస్పిటల్లో బంధువుల ఆందోళన

### పోలీసుల జోక్యం ఉద్రిక్తత



**ప్రజావాయిస్ కామారెడ్డి/**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవధాన్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో వివాహిత మృతి చెందడంతో బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. లింగంపేట కు చెందిన పరష రాజేశ్వరి 38 గర్భ సంచి తొలగించడానికి ఆపరేషన్ కోసం ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. అనస్తేషియా ఇంజక్షన్ ద్వారా లింగంపేట మహిళా మృతి చెందిందని భర్త నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందడంతో బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఆసుపత్రిలో ఆసుపత్రి ముందు ఆందోళన ధర్నా చేపట్టారు. బంధువుల ఆందోళనతో కామారెడ్డి పోలీసులు జోక్యం చేసుకుని గొడవ పెద్దది కాకుండా ఇరు వర్గాలకు మంచి నచ్చ చెప్పారు. ఆసుపత్రి ముందు వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ చనిపోయిందని బంధువులు ఆందోళన చేపట్టారు పరిస్థితి ఉద్ధృతంగా మారింది పోలీసులు జోక్యం చేసుకొని గురువర్గాలను శాంతింపజేశారు ఆసుపత్రి యాజమాన్యంపై వైద్యులపై చర్యలు తీసుకోవాలని మృతి చెందిన మహిళ భర్త నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.వైద్య చికిత్సలు నిర్లక్ష్యం చేసిన ప్రజలపై ఆసుపత్రి యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# మోడీ సర్కారు మాటల సర్కార్

### రైతుల పై సవతి ప్రేమ

### ప్రజల ధనం కార్పొరేట్ బలం

### యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు. జాతీయ రహదారి పై ధర్నా రాస్తారోక్

**ఆగస్ట్ 27 (ప్రజా వాయిస్) చేగుంట**
మసాయిపేట మండలంలో యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాసాయిపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జాతీయ రహదారి-44పై రైతులు ధర్నాకు దిగారు. ఫర్టిలైజర్ యాప్ను రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్లో నమోదు చేసిన గంటలోపే యూరియా స్టాక్ అయిపోయిందని, షాప్ యజమాని చెబుతున్నారని, సర్వర్ సమస్యలతో చదువురాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కనీసం ఒకటి, రెండు యూరియా బస్తాలైనా దొరికేవని, ఇప్పుడు ఒక్క బస్తా యురియా దొరకడం లేదని పేర్కొన్నారు.విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డీ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి, త్వరలోనే యాప్ లో బుక్ చేసుకున్న ప్రతి ఒక్క రైతు కి యూరియా వచ్చేటట్లు చూస్తానని చెప్పడంతో రైతులు శాంతించి రాస్తారోకో విరమించారు.




# మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో SIR ప్రక్రియపై అవగాహన సదస్సు

**మేడ్చల్, శామీర్ పేట్ / ప్రజా వాయిస్**
ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన SIR ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మహమ్మద్ గులాం ఇద్రిస్, మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకట గోపాల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం పాల్గొని ప్రజలకు ఓటరు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ప్రతి ఓటరు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఇప్పటికే అందించిన ఎనయూమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి సంబంధిత అధికారులకు తిరిగి అందజేయాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాని పౌరులు ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు పేరు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే ఫారమ్-8 ద్వారా దరఖాస్తు చేసుకుని వివరాలను సరిచేసుకోవచ్చని వివరించారు. SIR ప్రక్రియపై ప్రజలకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేస్తూ, దరఖాస్తుల సమర్పణ విధానం, అవసరమైన సవరణలు, ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు ఓటర్ల జాబితాలో తన వివరాలను పరిశీలించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది.

# నల్లబ్యాడ్జీలతో ఉద్యాన వర్సిటీ ఉద్యోగుల నిరసన

## పీఆర్సీ అమలు'6 డీఏలు విడుదల చేయాలని డిమాండ్





**ప్రజా వాయిస్, రాజేంద్రనగర్:**
పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన కార్యాలయ ఉద్యోగులు గురువారం నిరసన చేపట్టారు. టీజీఈజెఏసి పిలుపు మేరకు నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు.ములుగు లోని పరిపాలన కార్యాలయం నుంచి మెయిన్‌గేట్ వరకు ర్యాలీగా వెళ్లిన ఉద్యోగులు అక్కడ మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని,సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్‌ను కూడా అమలు చేయాలని కోరారు.విశ్వవిద్యాలయం పరిధిలోని రాష్ట్రవ్యాప్తంగా 10 రీసెర్చ్ స్టేషన్లు,6 కళాశాలల్లో కూడా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎ.చెంచు రామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.